4-3Pg6exHMNWJQE.qxd:4-3Pg6exHMNWJQE.qxd 1/1/02 6:46 AM Page 1





శ్రీకాళహస్తీశరుని దర్శనానికి వెళుతున్న భక్తులు

## శివయ్యకు శాంతి అభిషేకాలు: భక్తులకు సుదర్శనం

శ్రీకాళహస్తి, మార్చి 3 ప్రభాతవార్త: తిరుమలేశుని సన్నిధితో పాటు ప్రధాన ఆలయాలు చంద్రగ్రహణం సందర్భంగా మూతపడ్డాయి. శ్రీకాళహస్తి పట్టణంలోని సుబ్రమణ్యం స్వామి ఆలయాలు ఉదయం 12గంటల నుంచి మూతపడ్డాయి. సాయంత్రం 7గంటలకు శుద్ధి చేసి తెరిచి దర్శనం ఏర్పాటు చేసారు. తేరువీధి, కుమారస్వామి కొండపై వెలసిన సుబ్రమణ్యం స్వామి ఆలయాలకు విశేష సంఖ్యలో పూజలు నిర్వహించటం ఆనవాయితి ఈ ఆలయాలను కూడా మూసి వేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు వాయులింగేశ్వరునికి గ్రహణం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు చేసారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఆలయంలో పూజలు ప్రారంభించారు. మధ్యస్థకాలంలో వాయులింగేశ్వరునికి శాంతి అభిషేకం నిర్వహించారు. వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా ఆలయ అర్చకులు, అభిషేక గురుకుల్స్ శాంతి అభిషేకాన్ని నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

**భక్తులకు దర్శనం అవకాశం:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువుకు గ్రహణ కాలంలో శాంతి అభిషేకం ఏర్పాటు చేసారు. అయితే గతంలో రాత్రి వేళ వచ్చిన గ్రహణం సందర్భంగా భక్తులను అనుమతించలేదు. అయితే ఈ ఏడాది మొదటగా వచ్చిన చంద్రగ్రహణం పగలు వచ్చింది కాబట్టి ఆలయ ఇఓ బాపిరెడ్డి చొరవ చూపారు. వచ్చిన ప్రతి భక్తునికి స్వామి దర్శన భాగ్యం కల్పించుటకు నిర్ణయించారు. స్వామి మూలవిరాట్టుకు అభిషేకాలు జరుగుతుండగా వచ్చిన ప్రతి భక్తుని దర్శన భాగ్యం కల్పించారు. అయితే మంగళవారం ఎవ్వరిని అంతరాలయ దర్శనానికి అనుమతించలేదు. దాంతో వచ్చిన ప్రతి భక్తుడు సాధారణ క్యూలో స్వామి వారి అభిషేకాన్నే కాకుండా 'నిజరూప దర్శనం' కూడా చేసుకున్నారు. ఆలయ ఇఓ నిర్ణయాన్ని భక్తులు అభినందించారు. జిల్లాలోని ఆలయాలన్ని మూసివేయగా శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చిన వారికి అభిషేక భాగ్యం కల్పించిన దేవాదాయశాఖ అధికారుల చొరవను పలువురు ప్రశంసించారు.

## కాణిపాకం ఆలయం మూసివేత

కాణిపాకం, మార్చి 3 ప్రభాతవార్త: పాక్షిక కేతు గ్రస్త చంద్రగహణం సందర్భంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి ఆలయాన్ని మంగళవారం ఉదయం నుండి శాస్త్రోక్తంగా మూసివేశారు. మంగళవారం మధ్యాహ్నం 3.20 గంటలకు పాక్షిక చంద్రగ్రహణం సంభవించడంతో 9 గంటల ముందుగా ఉదయం 6.20 గంటలకు ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలైన శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ ్వరాలయం, శ్రీవరద రాజస్వామి ఆలయంలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా మూసివేశారు. ఉదయం 6.20 గంటల వరకు ఆలయాల్లో యధావిధిగా భక్తులకు దర్శనాలు, ఆర్జిత సేవలను కొనసాగించి అనంతరం ఆలయాలను మూసివేశారు. తిరిగి గ్రహణానంతరం ఆలయాలను సాయంత్రం 6.47గంటలకు తెరచి ఆలయశుద్ధి పుణ్యాహావాచనం, గ్రహణానంతరం అభిషేకాలు ఏకాంతంగా నిర్వహించి ఆలయానికి మూసి వేశారు. బుధవారం వేకువజామున 4 గంటలకు ఆలయానికి తెరచి యధావిధిగా భక్తులు భక్తులకు దర్శనాలు కలి ్పంచడంతో పాటు ఆర్జిత సేవలను కొనసాగించనున్నట్లు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ తెలిపారు. చంద్రగ్రహణ సందర్భంగా కాణిపాకంలో ఆలయాలతో పాటు దుకాణాలు మూతపడడంతో భక్తులు లేక ఆలయ పరిసరాలన్ని నిర్మానుష్యంగా మారింది.



చంద్రగ్రహణం సందర్భంగా కాణిపాకం ఆలయాన్ని మూసివేస్తున్న ఆలయ అర్చకులు



## వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణమహోత్సవం

### సతీసమేతంగా పాల్గొన్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్

విజయవాడ, మార్చి 3 ప్రభాతవార్త ప్రతినిధి: మంగళగిరిలో శ్రీ లక్ష్మీ ృ నరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 12 గం.లకు దేవస్థానం ఉత్సవ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీవారి కల్యాణ మహోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, బ్రాహ్మణి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీ ృ నరసింహస్వామి వారికి ప్రభుత్వం తరపున నారా లోకేష్ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల మధ్య స్వామి వారి కల్యాణాన్ని తిలకించి ప్రత్యేక ఆశీర్వచనాలు పొందారు. అంతకుముందు దేవాలయ ప్రాంగణానికి చేరుకున్న విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, నారా బ్రాహ్మణి దంపతులకు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. స్వామి వారి దివ్య కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఎపిఎంఎస్ఐడిసి ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టిటిడి బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.

## చెత్త మీద వాళ్లు పన్ను వేస్తే... మేము ఆ చెత్తనే కొంటున్నాం

### రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర ఛైర్మన్ పట్టాభిరామ్



తంబళ్లపల్లె, మార్చి 3 ప్రభాతవార్త: నాటి వైకాపా ప్రభుత్వం చెత్త మీద పన్నువేసి చెత్త ప్రభుత్వంగా నిలవగా మా ఎన్డీఏ ప్రభుత్వం ఆ చెత్తని ప్రజలకు సేవ చేస్తున్నట్లు రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర ఛైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. స్వచ్ఛ ఆంధ్రపై తంబళ్లపల్లె నియోజకవర్గంలోని అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన ఆరు మండలాల ఎంపిడిఓలతో పారిశుద్ధ్యంతో పాటు డంపింగ్ యార్డ్ల నిర్వహణ, చెత్త సేకరణ, ఎరువుల తయారీ, స్వచ్ఛ వాహనాలపై విడివిడిగా చర్చించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేశంలోనే ఎక్కడా లేని విధంగా పారిశుద్ధ్యానికి పెద్దపీట వేసి నెలలో ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం చేపట్టిన ఘనత ఆయనదేనన్నారు. అధికారులు అంకెల గారిడి లేకుండా చిత్తశుద్ధితో చెత్త సేకరణపై దృష్టి సారించి స్వచ్ఛరథాల నిర్వహణ లోపం లేకుండా చూడాలన్నారు. రాష్ట్రవ్యాప్తం గా 200 ప్లాస్టిక్ మేనే జ్మెంట్ యూనిట్లు, 12 వేలకు పైగా ట్రై సైకిళ్లు, 5000 స్వచ్ఛ రథాలు ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కురబలకోట, మొలకల చెరువులలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రం చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ముఖ్య మంత్రి చేస్తున్న లక్ష ్యసాధనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గ్రామాలలో టాయిలెట్లు, కమ్యూనిటీ టాయిలెట్లు నిర్మాణానికి ఎన్ని నిధులైన అందుబాటులో ఉన్నాయని ఆర్డబ్ల్యూ ఎస్ ఎస్ఈ ద్వారా మంజూరు చేయించుకుని నిర్మించాలన్నారు. పంచాయతీల అభివృద్ధికి పన్నులు వసూళ్లతో పాటు గ్రామాల అభివృద్ధికి సమిష్టి కృషి చేయాలని సూచించారు. గత ప్రభుత్వం పారిశుద్ధ్యంపై నిరక్ష ్యం వహించిం దని నేడు ఎన్డీఏ పాలనలో స్వచ్ఛ ఆంధ్రకు ప్రాధాన్యతనిచ్చి పల్లె సీమలు పర్యావరణ పరిరక్షణతో అభివృద్ధి చెందడానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. పారిశుద్ధ్యంతో పాటు తాగునీటి సమస్యలు, మౌలిక సదుపాయాలపై నాయకులు అధికారుల సమన్వయంతో అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ రాధమ్మ, డిఎల్పిఓ నాగరాజు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సతీష్ కుమార్, డిఇ చంద్రశేఖర్ రెడ్డి, ఏఈ వినోద్ కుమార్ ఆరు మండలాల ఎంపిడిఓలు, అన్ని శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

**స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన కొమ్మిరెడ్డి**

రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర ఛైర్మన్ కొమ్మిరెడ్డి పట్టాభిరామ్ తంబళ్లపల్లెలో పురుషోత్తం ఏర్పాటుచేసిన స్వచ్ఛరథాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొమ్మిరెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ ఈ స్వచ్ఛరథం ద్వారా సేకరించిన ప్లాస్టిక్, తడి పొడి చెత్త సేకరించి అందుకు సరిపడా సరుకుల రూపంలో ప్రజలకు అందించాలని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు సహకరించాలని సూచించారు.

## చిత్తూరు జిల్లా కోర్టుకు బాంబు బెదరింపు

- కోర్టు నుండి పరుగులు తీసిన న్యాయవాదులు
- రంగంలో దిగిన పోలీసు డాగ్ స్క్వాడ్
- బాంబు లేదని నిర్ధారణతో ఊపిరి పీల్చుకున్న కోర్టు సిబ్బంది

చిత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో కోర్టులో విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టుకు వచ్చిన కక్షిదారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. చిత్తూరు కోర్టు భవనాల్లో 14 సైనైడ్ బాంబులు అమర్చడం జరిగిందని ఈ బాంబులు మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు పేలుతాయని మెయిల్లో హెచ్చరించడంతో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులు కోర్టు నుండి పరుగులు తీశారు.

జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు వచ్చిందన్న సమాచారం అందుకున్న వన్టౌన్ ఇన్స్పెక్టర్ మహేశ్వర్, టుటౌన్ ఇన్స్పెక్టర్ నెట్టికంఠయ్య హుటాహుటిన కోర్టు ప్రాంగణంకు చేరుకొని కోర్టులో వున్న న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారులను వెలుపలికి రప్పించడానికి చర్యలు చేపట్టారు. అ క్రమంలో పోలీస్ బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్కు సమాచారం అందడంతో వారు సైతం కోర్టు వద్దకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. జిల్లా కోర్టుకు ఉదయం మధ్యాహ్నం 12.30 గంటలకు బాంబు బెదిరింపు మెయిల్ రాగా పోలీసులకు 12.50 గంటలకు సమాచారం అందింది. మధ్నాహ్నం 1 గంటలకు కోర్టు ప్రాంగణంకు వన్టౌన్ ఇన్స్పెక్టర్ మహేశ్వర్, టుటౌన్ ఇన్స్పెక్టర్ నెట్టికంఠయ్య, డాగ్ స్క్వాడ్ సిబ్బంది చేరుకుని తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఎక్కడ బాంబు పెట్టిన దాఖలాలు కన్పించకపోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. తమిళనాడు రాష్ట్రంకు చెందిన కనిమెయిలీ అనే మెయిల్ ఐడి ద్వారా కోర్టు మెయిల్కు మెయిల్ వచ్చింది. అంటే తమిళనాడు రాష్ట్రం నుండి ఈ మెయిల్ రావడంతో ఈ మెయిల్ ఎక్కడి నుండి పెట్టారనే విషయంపై పోలీసులు విచారణ ప్రారంభించారు.



చిత్తూరు కోర్టులో బాంబు పెట్టినట్లు సమాచారం రావడంతో విస్తృతంగా తనిఖీలు చేస్తున్న డాగ్ స్క్వాడ్ బృందం



## సాఫ్ట్వేర్ ఇంజినీర్ గొలుసుల దొంగతనం

- నిందితుడి అరెస్ట్, రూ.40 లక్షల విలువైన బంగారం, వెండి స్వాధీనం: ఎస్పీ ధీరజ్ కునుబిల్లి వెల్లడి

మదనపల్లె క్రైమ్, మార్చి 3 ప్రభాతవార్త: సాఫ్ట్వేర్ ఇంజనీర్గా సమాజంలో గౌరవప్రదమైన స్థితిలో ఉండాల్సిన ఒక వ్యక్తి, విలాసాలకు అలవాటు పడి దొంగగా మారిన ఘటన అన్నమయ్య జిల్లాలో వెలుగుచూసింది. వరుస దొంగతనాలకు పాల్పడుతున్న మోస్ట్ వాంటెడ్ 'హాబిచ్యువల్ అఫెండర్'ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుండి సుమారు రూ.40 లక్షల విలువైన 250 గ్రాముల బంగారు ఆభరణాలు, 930 గ్రాముల వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి వెల్లడించారు. మదనపల్లె మండలం ఈశ్వరమ్మ కాలనీకి చెందిన కోరకూటి రాజేష్(35) వృత్తిరీత్యా సాఫ్ట్వేర్ ఇంజనీర్. కరోనా సమయంలో ఉద్యోగం కోల్పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో, విలాసవంతమైన జీవితం కోసం దొంగతనాలను వృత్తిగా మార్చుకున్నాడు. మదనపల్లె పట్టణం, కజిన్స్ స్ట్రీట్లో ఉంటున్న రెడ్డి ప్రసాద్ ఫిబ్రవరి 16న ఊరికి వెళ్లడంతో రెక్కీ నిర్వహించిన రాజేష్ ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న 200 గ్రాముల బంగారు ఆభరణాలు, 2 కిలోల వెండి వస్తువులు దొంగలించాడు. రెడ్డి ప్రసాద్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పట్టుకున్నారు. విచారణలో మరో రెండు దొంగతనాలు చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. గత ఏడాది మార్చి 24న దేవలం వీధిలోని వృద్ధురాలు రాజమ్మ మెడలోని 30 గ్రాముల చైన్, ఫిబ్రవరి 6న దేవాలం వీధిలోనే మరో వృద్ధురాలు విజయ మెడలోని 25 గ్రాముల బంగారు గొలుసును దొంగిలించాడు. నిందితుడి నుంచి బంగారు, వెండిని స్వాధీనం చేసుకొని రిమాండ్ తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ చాటిన సిసిఎస్ ఇన్స్పెక్టర్ ఎం.చంద్రశేఖర్, 1టౌన్ సిఐ రాజారెడ్డి, ఎస్.కె రహమతుల్లా, పోలీస్ అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించి, నగదు రివార్డులను అందజేశారు.

## ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులు చేరేలా చర్యలు

### - యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజా, జి.వి.రమణలు



చిత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త: గ్రామంలో వున్న పాఠశాలను బతికించుకోవడానికి విద్యార్థులందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించడాన్ని తక్షణ కర్తవ్యంగా భావించి గ్రామాల్లో ఉపాధ్యాయులు డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించి పాఠశాలల్లో ఎన్రోల్మెంట్ శాతంను పెంచుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు బి.లక్ష్మీరాజా, జివి రమణలు పిలుపునిచ్చారు. చిత్తూరు యుటిఎఫ్ భవనంలో మంగళవారం జిల్లా యుటిఎఫ్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శులు బి.లక్ష్మీరాజా, జివి రమణలు మాట్లాడుతూ విజయవాడలో రణభేరి-2.0 పేరిట 16 వేల మంది యుటిఎఫ్ కార్యకర్తలతో నిర్వహించిన ధర్నాకు ప్రభుత్వం నుండి ఎలాంటి కదలిక రాలేదని, అయితే దీనిపై ఎపిజెఎసిలో కదలిక వచ్చిందన్నారు. అలాగే రణభేరి-3.0 ద్వారా ప్రభుత్వంను కదిలించే విధంగా యుటిఎఫ్ కార్యకర్తలు సిద్ధంగా వుండాలని పిలుపనిచ్చారు. రణభేరి-3.0 జయప్రదం చేయడంలో భాగంగా మార్చి 24వ తేదీ నిర్వహించతలపెట్టిన నియోజకవర్గ స్థాయి నిరసన, ధర్నా కార్యక్రమంను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రతి మండలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంను నిర్వహించాలన్నారు. అలాగే రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి మే నెలలో పదోన్నతులు, బదిలీలు జరుగుతాయని విద్యాశాఖ ప్రకటించిందన్నారు. విద్యాశాఖ ప్రకటించిన సీనియార్టీ జాబితాలో అనుమానాలు వుంటే సత్వరం డిఇఓకు అప్పీల్ చేసి పరిష్కరించుకోవాలన్నారు. అలాగే 2008 డిఎస్సీకి ముందు జాయిన్ అయిన ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని, టెట్ పరీక్షలు సంవత్సరంలో రెండు సార్లు నిర్వహించాలని, అలాగే 35 మార్కులకే పాస్ చేయాలని ప్రభుత్వంకు ప్రాతినిధ్యం చేసినట్లు వారు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా యుటిఎఫ్ అధ్యక్షుడు రెడ్డప్ప నాయుడు, ప్రధాన కార్యదర్శి మణిగండన్, జిల్లా గౌరవ అధ్యక్షుడు సదాశివ రెడ్డి, సహ అధ్యక్ష్యురాలు రెహెనాబేగం, రాష్ట్ర కౌన్సిలర్లు సోమశేఖర్ నాయుడు, ఎస్పీ బాషాలు, జిల్లా కార్యదర్శులు ఈశ్వర మహేంద్ర, ఎం.పార్థసారధి, ఎం.శ్రీనివాసులు, పిసి బాబు, కె.వంశీకృష్ణ, వాసుదేవపిళ్ళై తదితరులు పాల్గొన్నారు.



## ఆ నలుగురి ఆచూకీ లభ్యం

### కర్ణాటకలోని ఎల్లంపురంలో గుర్తింపు... రొళ్లకు తీసుకొచ్చి సురక్షితంగా కుటుంబ సభ్యుల చెంతకు చేర్చిన పోలీసులు

రొళ్ల, మార్చి 3 ప్రభాతవార్త: శ్రీసత్యసాయి జిల్లా, రొళ్ల మండలం, హెచ్.టి. వడ్రహట్టి గ్రామానికి చెందిన లక్ష్మీ ృ అనే మహిళ రెండు రోజుల క్రితం తన తల్లి సుబ్బమ్మతో పాటు తన ఇద్దరు పిల్లలు రోషిణి, రచనలను తీసు కుని ఎవరికీ తెలియకుండా కర్ణాటక రాష్ట్రం లోని ఎల్లంపురం ప్రాంతానికి వెళ్లినట్లు సమా చారం అందింది. ఈ విషయం పై విశ్వసనీయ సమాచారం అందడంతో రొళ్ల పోలీస్ స్టేషన్ నుండి ప్రత్యేక బృందం ఎల్లంపురం ప్రాంతానికి వెళ్లి లక్ష్మీ ృ, ఆమె తల్లి సుబ్బమ్మ మరియు పిల్లలను గుర్తించి సురక్షి తంగా తీసుకొచ్చింది. చట్టంపై నమ్మకంతో లక్ష్మీ స్వచ్ఛందంగా పోలీస్ సిబ్బందితో, ముఖ్యంగా పిసి వన్నప్పతో కలిసి వచ్చిందని ఎస్ఐ గౌతమి తెలిపారు. మొత్తం ప్రక్రియ శాంతి యుతంగా, చట్టబద్ధంగా నిర్వహించామ న్నారు. ప్రస్తుతం సంబంధి త వ్యక్తులను కుటుంబ సభ్యులకు అప్పగించి అవసరమైన తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నా మని ఎస్ఐ గౌతమి వివరించారు.

## అంతర్రాష్ట్ర బైక్ దొంగ అరెస్ట్

### 24 ఖరీదైన మోటార్ సైకిళ్లు స్వాధీనం



రాయచోటి, మార్చి 3 ప్రభాతవార్త: సుమారు రూ.40 లక్షల విలువైన 24 ఖరీదైన మోటార్ సైకిల్ వాహనాలు రికవరీ చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కొనుబిల్లి వెల్లడించారు. రాయచోటిలోని పోలీస్ థైరాయిడ్ మైదానంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాయచోటి టౌన్ ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ అలీఫ్ 38 అనే వ్యక్తి 2024 సంవత్సరం నుంచి చోరీలు చేసుకుంటూ విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో పగలు రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో తాళాలు వేసిన బైకులను మాయం చేసేవాడని తెలిపారు. నిందితుడు కేవలం అన్నమయ్య జిల్లాలోనే కాకుండా చిత్తూరు, తిరుపతి, కడప జిల్లాలోనూ తన హస్తలాగువాన్ని ప్రదర్శించి బైకులను చోరి చేస్తుండే వాడిని ఆయన అన్నారు. వరుసగా మోటార్ సైకిల్ దొ ం గ త నా ల కు ్ పాల్పడుతున్న ఒక కిలాడీ దొంగను, అతడి వద్ద నుండి బైకులు కొనుగోలు చేస్తున్న ముగ్గురు రిసీవర్లను పీలేరు పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. రాయచోటి, పీలేరు, కలకడ, సంబేపల్లి, మదనపల్లి, పుంగనూరు, చిత్తూరు టౌన్, పలమనేరు, తిరుపతి, కడప టౌన్, రాజంపేట తదితర ప్రాంతాల్లో 1. రాయల్ ఎన్ఫీల్డ్ (బుల్లెట్) 172. బజాజ్ పల్సర్ 053. హోండా షైన్ 014. హీరో స్ప్లెండర్ ప్లస్ 1 దొంగలించినట్లు ఆయన తెలిపారు.

**అరెస్ట్ చేసిన తీరు:** పీలేరు మండలంలోని పొంతలచెరువు క్రాస్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా పోలీసులను చూసి పారిపోతున్న ఆరిఫ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అతడు ఇచ్చిన సమాచారం మేరకు, దొంగిలించిన బైకులను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న షేక్ బషీర్, షేక్ సయ్యద్ ముక్తియార్, షేక్ మహమ్మద్ అలీను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సమర్థవంతంగా పనిచేసిన రాయచోటి డిఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్, పీలేరు సిఐ యుగంధర్ ఎస్ఐలు లోకేష్, రహీం, పీలేరు హెడ్ కానిస్టేబుల్స్ వేణు, ఉపేంద్ర, జగదీష్, పోలీస్ సిబ్బంది, హోంగార్డులను ఆయన అభినందించారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతోనే సంపూర్ణ ఆరోగ్యం

### - ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్





కుప్పం, మార్చి 3 ప్రభాతవార్త: రైతులుసాగు చేసే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మంజునాథ కన్వెన్షన్ హాల్లో రీజనల్ స్థాయిలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయదారులు, కొనుగోలుదారులకు వ్యాపార సంబంధ వేదిక కార్యక్రమంను రైతు సాధికార సంస్థ (ఆర్వైఎస్ఎస్) అధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు 2014 నుంచే ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారన్నారు. గతంలో జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయంగా ఉన్న ఈ కార్యక్రమం నేడు పెద్ద ఎత్తున విస్తరించిందన్నారు. సిఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా ఆర్గానిక్ కుప్పం సాధనకు సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కుప్పంలో ప్రకృతి సాగు చేస్తున్న రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలనే ఉద్దేశంతో రైతు సాధికార సంస్థ ఛైర్మన్ విజయ్‌కుమార్ సహకారంతో ఈనెట్ వర్కింగ్ వేదిక ఏరా ్పటుచేశారన్నారు. రైతులు వ్యాపార వేత్తలుగా ఎదగాలని సూచించారు. మితిమీరిన ఎరువుల వాడకంతో ప్రాణాంతక వా ్యధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత ్నం మాట్లాడుతూ రైతులు వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం పంటలకు తగ్గిస్తే భూమిసారవంతంగా ఉంటుందన్నారు. తద్వారా ఆయా సీజన్లలో రైతులు పంటలసాగు చేయవచ్చున్నారు.

జిల్లా వ్యవసాయాధికారి మురళి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఎపికి ఐదువేల క్లస్టర్లు, నాలుగువేల బిఆర్‌సిలను కేటాయించారన్నారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, జిల్లా వ్యవసాయాధికారి మురళి, రైతు నేస్తం ఫౌండేషన్ ప్రతినిధి వెంకటేశ్వరరావు, రైతు సాధికార సంస ్థ సీనియర్ థీమాటిక్ లీడ్ చంద్రశేఖర్, సీనియర్ కన్సలె ్టంట్ ప్రణయ్ భార్గవ్, డిపిఎం అమృతవల్లి, మార్కెటింగ్ టిఎల్ బిజయ్ నర్సింగ్, నోడల్ అధికారి బాజీబాబు, మండల అధ్యక్షులు ఉదయ్‌కుమార్, వెంకటరమణ, కడ సభ్యురాలు సుగుణమ్మ, చంద్ర, రైతులు పాల్గొన్నారు.

## పిసిసి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



విజయవాడ, మార్చి 3 ప్రభాతవార్త ప్రతినిధి: రంజాన్ సందర్భంగా ఎపి పిసిసి ఆధ్వర్యంలో విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఇఫ్తార్ విందు నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ మాసం శాంతి, సహనం సేవాభావాలకు ప్రతీకగా అభివర్ణించారు. ఈ పవిత్ర మాసంలో మీ ప్రార్థనలు ఫలించాలన్నారు. అల్లా దయ రాష్ట్రంపై ఉండాలని ఆకాంక్షించారు. ముస్లిం మైనారిటీల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేసిందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మైనారిటీ రిజర్వేషన్‌లను తెచ్చారన్నారు. 4 శాతం రిజర్వేషన్ కల్పించడం దేశంలో మొదటి సారి అన్నారు. ముస్లిం రిజర్వేషన్లతో ముస్లిం బిడ్డలు ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు. ఇది ముస్లింలపై కాంగ్రెస్‌కి ఉన్న నిబద్ధత. కాంగ్రెస్ తర్వాత ఏ పార్టీ కూడా పట్టించుకోలేదన్నారు. టిడిపి, వైసిపిలు ముస్లింలను దారుణంగా మోసం చేశాయి. ముస్లింల హక్కులకోసం కాంగ్రెస్ ఎంతటి పోరాటానికైనా సిద్ధమని షర్మిల పేర్కొన్నారు.

ong-8_ong-8.qxd 3/4/2026 1:00 AM Page 1



## సభ్యుల సంక్షేమమే నూతన కార్యవర్గం ప్రధాన ధ్యేయం

- ఏపీ ఎన్జీఓస్ సంఘం నగర అధ్యక్షకార్యదర్శులు వై.నారాయణరావు,గుర్రం చంద్రరావు

**విశాఖపట్నం, మార్చి 03 (ప్రభాతవార్త)**



విశాఖ సిటీ ఏపీ ఎన్జీవోస్ కార్యవర్గ సభ్యుల కీలక సమావేశం నగరంలో ఎన్జీఓస్ కార్యాలయం లో ఉత్సాహంగా జరిగింది. సిటీ అధ్యక్షులు నారాయణరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ నగేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సెక్రటేరియట్ మీటింగ్‌లో సంఘం బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశ వివరాలను సంఘం కార్యదర్శి గుర్రం చంద్రరావు వెల్లడిస్తూ, ఎన్నికల అనంతరం కార్యవర్గ సభ్యులంతా కలిసి సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. సంఘం బలోపేతానికి సభ్యుల మధ్య ఐక్యత, పరస్పర అవగాహన ముఖ్యమని, ప్రతి ఒక్కరూ సంఘం కార్యాలయ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఏపీ ఎన్జీవోస్ సభ్యత్వ నమోదు మరియు ఏపీ ఎన్జీవోస్ సమాచార పత్రిక చందా ప్రక్రియను వేగవంతం చేయాలని సభ్యులను కోరారు.అసోసియేషన్ వ్యవస్థాపకులు ఎంతో కష్టపడి నిర్మించిన ఈ సంఘాన్ని మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలన్నారు. సభ్యులందరూ వారానికి కనీసం రెండు సార్లు సంఘం కార్యాలయానికి వచ్చి సహచరులతో చర్చించాలని, దీనివల్ల పని చేసే ఉత్సాహం మరింత పెరుగుతుందని సూచించారు. అలాగే సంఘ శ్రేయస్సు దృష్ట్యా గ్రూపుల్లో పెట్టే ముఖ్యమైన సమాచారానికి సభ్యులు వెంటనే స్పందించాలని, ఐకమత్యంతో ముందుకు సాగాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీఈసీ సభ్యులు మరియు ఇతర కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నడుస్తున్న బైక్‌లో మంటలు

**గాజువాక, మార్చి 3,ప్రభాతవార్త**



గాజువాక బీసీ గేటు వద్ద మంగళవారం మధ్యాహ్నం ప్రమాదం చోటుచేసుకుంది. ఓ వ్యక్తి ప్రయాణిస్తున్న బైక్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన వాహనదారుడు వెంటనే దిగిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు అప్రమత్తమై సమీపంలోని పెట్రోల్ బంకు నుంచి అగ్నిమాపక పరికరాలు తెచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో బైక్ సగానికి పైగా కాలిపోయింది.

## చిన్నారుల భవిష్యత్తుకు ముందస్తు పరీక్షలు కీలకం

- మెడికవర్ వైద్యుడు వినయ్‌కుమార్

**ఆరిలోవ, మార్చి 3, ప్రభాతవార్త**



మార్చి 3న జరుపుకునే ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా డబ్ల్యూహెచ్ఓ ఈ సంవత్సరం సమాజాల నుంచి తరగతి గదుల వరకు - ప్రతి చిన్నారికి వినికిడి సంరక్షణ" అనే ఇతివృత్తాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్‌కు చెందిన ఈ ఎన్ టి నిపుణులు డాక్టర్ టి. వి. వి వినయ్ కుమార్ చిన్నారులకు తొందరగా వినికిడి పరీక్షలు చేయాలని సూచించారు. వినికిడి లోపం ఆలస్యంగా గుర్తిస్తే మాటల అభివృద్ధి, చదువు, భావోద్వేగ స్థితి, సామాజిక నైపుణ్యాలపై దీర్ఘకాల ప్రభావం పడవచ్చని ఆయన తెలిపారు. పిలిచినప్పుడు స్పందించకపోవడం, మాటలు స్పష్టంగా రాకపోవడం, అసాధారణ నిశ్శబ్దం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. సమయానికి గుర్తించి చికిత్స, హియరింగ్ ఎయిడ్స్, కోక్లియర్ ఇంప్లాంట్స్,స్పీచ్ థెరపీ ద్వారా పిల్లల విద్యా,సామాజిక అభివృద్ధి మెరుగు పడు తుంది. ప్రతి శిశువుకూవినికిడి స్క్రీనింగ్ తప్పనిసరి చేయాలని మెడికవర్ హాస్పిటల్స్ పిలుపునిచ్చింది.

## వ్యాపార వేత్తలగా ఎదగడానికి శిక్షణా కార్యక్రమాలు దోహదం

**ఆనందపురం, మార్చి 3, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని యువ ఇంజినీర్లు భావి పారిశ్రామిక వేత్తలగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లు విజయానంద రెడ్డి, రాజారావు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో, జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ గురజాడ (విజయనగరం) మార్గదర్శకత్వంలో మండలంలోని శొంట్యాంలో ఉన్న ఎన్ ఎస్ ఆర్ ఐ టి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు పైథాన్ ఫుల్ స్టాక్ డెవలప్ మెంట్ శిక్షణను ఏర్పాటు చేశారు. ఇక్కడ మార్చి 11 వరకు కళాశాల ప్రాంగణంలో ఆఫ్‌లైన్ విధానంలో కొనసాగే కార్యక్రమంలో విద్యార్థులకు ప్రాక్టికల్ నైపుణ్యాలు, హ్యాండ్స్ ఆన్ అనుభవం పరిశ్రమలా స్థాపనకు అనుగుణమైన సామర్థ్యాలను అందిస్తున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ప్రభుత్వం స్కిల్ ఇండియా, స్టార్టప్ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని వీటి ద్వారా యువత భవిష్యత్‌లో పారిశ్రామిక వేత్తలగా ఎదిగి దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సాంబు ప్రసాద్, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఋషికొండలో కాయకింగ్ శిబిరం

*- స్పోర్ట్స్ కోటతో భవిష్యత్తు నిర్మాణం సీనియర్ కోచ్ వాసుపల్లి దాస్*

**(విశాఖపట్నం ప్రభాతవార్త)**



నగరంలోని ఋషికొండ బీచ్‌లో నిర్వహిస్తున్న కాయకింగ్, కనోయింగ్ శిక్షణ శిబిరం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ శిబిరంలో పాల్గొంటున్న విద్యార్థులను ఉద్దేశించి సీనియర్ కోచ్ వాసుపల్లి దాస్ మార్గనిర్దేశం చేశారు. క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే స్పోర్ట్స్ కోట ద్వారా ఉన్నత చదువులు, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చని ఆయన వివరించారు.రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించే అవకాశాలు క్రీడాకారులకు లభిస్తాయని తెలిపారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పతకాలు సాధించిన వారికి ఇంటర్, డిగ్రీ, విశ్వవిద్యాలయాల్లో స్పోర్ట్స్ కోట కింద ప్రత్యేక రిజర్వేషన్ సీట్లు కల్పిస్తారని చెప్పారు. క్రీడా ప్రతిభతో ఉన్నత విద్యలో ముందడుగు వేయవచ్చని సూచించారు. అదేవిధంగా పోలీస్, రైల్వే, ఆర్మీ, నేవీ తదితర ప్రభుత్వ విభాగాల్లో కూడా స్పోర్ట్స్ కోట ద్వారా ఉద్యోగావకాశాలు పొందవచ్చని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిత్య సాధన, శారీరక దారుఢ్యంపై దృష్టి పెట్టడం ద్వారా మాత్రమే ఈ అవకాశాలు సాకారం అవుతాయని విద్యార్థులకు సూచించారు. కాయకింగ్, కనోయింగ్ వంటి నీటి క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. చిన్న వయసులోనే క్రీడలను లక్ష్యంగా ఎంచుకుని జిల్లా స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు ఎదగాలని పిలుపునిచ్చారు.విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలని, స్పోర్ట్స్ కోట ద్వారా భవిష్యత్తు నిర్మాణానికి ఇది మంచి వేదికగా ఉపయోగపడుతుందని వాసుపల్లి దాస్ పేర్కొన్నారు.



## డిపాజిట్ స్కీమ్ పేరిట రూ.54 లక్షల మోసం భార్యాభర్తల అరెస్ట్

**(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)**



అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి డిపాజిట్ స్కీమ్ పేరిట రూ.54 లక్షలు వసూలు చేసి మోసం చేసిన భార్యాభర్తలను పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.పోలీసుల వివరాల ప్రకారం... పెందుర్తి పురుషోత్తపురం ప్రాంతానికి చెందిన ఇతంశెట్టి ఉమ (33), టీ.లతా కుమారి (39), ఎల్లంకి సత్యమూర్తి (45)లను నిందితులు అధిక లాభాలు ఇస్తామని ఆశ చూపించి డిపాజిట్ల రూపంలో మొత్తం రూ.54 లక్షలు సేకరించారు. అనంతరం డబ్బులు తిరిగి చెల్లించకుండా మోసం చేసినట్లు విచారణలో తేలింది.ఈ కేసులో అసివానిపాలెం, కంచరపాలెంకు చెందిన దాసరి తులసి (28), ఆమె భర్త దాసరి సురేష్ (38)లను నిందితులుగా గుర్తించారు. ఇతంశెట్టి ఉమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెందుర్తి ఇన్‌స్పెక్టర్ కే.వి. సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నమోదు చేసిన 24 గంటల్లోనే వేగవంతమైన చర్యలు తీసుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు.కేసు 318(4) ఆర్/డబ్ల్యూ 3(5) బీఎన్ఎస్, అని యంత్రిత డిపాజిట్ పథకాల నిషేధ చట్టం2019 సెక్షన్ 21(1)(2)(3) కింద నమోదు చేసినట్లు తెలిపారు.ఇదే విధంగా మోసం చేసిన ఘటనలపై దాసరి తులసిపై ద్వారక, కంచరపాలెం పోలీస్ స్టేషన్లలో కూడా కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. అధిక లాభాలు వస్తాయని చెప్పే అనధికారిక డిపాజిట్ పథకాలపై నమ్మకం పెట్టుకోరాదని, అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని పెందుర్తి సీఐ సతీష్ కుమార్ ప్రజలకు సూచించారు.

## గాజువాకకు మహర్దశ.. వినోదం, క్రీడలకు పెద్దపీట

- ఉగాది కల్లా 160 అడుగుల రోడ్డు సుందరీకరణ
- రూ.1.70 కోట్లతో అభివృద్ధి పనులు - ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

**గాజువాక,మార్చి 3,ప్రభాతవార్త**



గాజువాక నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు,గాజువాక పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన మోలిక సదుపాయాలతో పాటు క్రీడాకారులు, చిన్నారుల కోసం ప్రత్యేక వసతులు కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. వీఎంఆర్‌డీఏ నిధులు రూ.1.70 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల వివరాలను ఆయన వివరించారు.సరికొత్తగా 160 అడుగుల రోడ్డు...ఉడా 160 ఫీట్ రోడ్డులోని సెంటర్ ఐలాండ్‌లో ఉన్న 10 బ్లాకులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడ క్రీడాకారుల కోసం ఇండోర్ నెట్ గేమ్స్, ప్రజల కోసం వాకింగ్ ట్రాక్, విశాలమైన కార్ పార్కింగ్ సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. రానున్న ఉగాది పండుగ నాటికి ఈ పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను పల్లా ఆదేశించారు.ఏసీ ఆడిటోరియంగా కళా ప్రాంగణం....సమతానగర్‌లో ఉన్న కళా ప్రాంగణాన్ని కళాకారులకు, ప్రజలకు ఉపయోగపడేలా 500 సీట్ల సామర్థ్యంతో అత్యాధునిక ఏసీ ఆడిటోరియంగా మార్చనున్నారు. దీనివల్ల స్థానికంగా సాంస్కృతిక కార్యక్రమాలకు వేదిక లభించనుంది.మినీ కైలాసగిరిగా దయాల్ నగర్ కొండ...74వ వార్డు పరిధిలోని దయ్యాల నగర్ కొండపై పర్యాటక శోభ సంతరించుకోనుంది. ఇక్కడ ఖిమినీ కైలాసగిరిఖి తరహాలో వాకింగ్ ట్రాక్ పార్కును ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే ఆదర్శ స్టేడియంలో క్రీడాకారుల ప్రయోజనాల దృష్ట్యా మరిన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధి పనుల్లో చురుగ్గా పాల్గొంటున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్ భరత్, ఛైర్మన్ ప్రణయ్, సి.వినయ్ కుమార్, పనులను పర్యవేక్షిస్తున్న ఈఈ రాజు, డీఈ సిబ్బందికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గ సమన్వయకర్త, ఏపీఎస్ఎల్సీ డైరెక్టర్ ప్రసాదుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో వివరాలను వెల్లడించారు.

## వేర్వేరు ప్రాంతాలలో ఒకేసారి అరుణోదయ సంకీర్తన

**ఆనందపురం, మార్చి3, ప్రభాతవార్త**



ఆనందపురం మండలంలోని గంభీరంలో ఉన్న హరే కృష్ణ వైకుంఠం మందిరం భక్తులు ఆధ్వర్యంలో చైతన్య మహా ప్రభు జయంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయం నగరంలోని 55 ప్రాంతాలలో ఒకేసారి అరుణోదయ సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమిలి, ఆనందపురం మండలాలు, తగరపువలస , సంగివలస, భీమిలి క్రాస్ రోడ్ , గంభీరం, ఐఐఎం రోడ్ , శొంట్యాం ప్రాంతాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యదురాజా దాస మాట్లాడుతూ శ్రీ చైతన్య మహా ప్రభు ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ కలియుగంలో అరుణోదయ సంకీర్తన ఉద్యమాన్ని అయిదు వందల ఏళ్ల క్రితమే భారత్ దేశంలో ప్రారంభించి విశ్వ వ్యాప్తం చేసారని చెప్పారు.

## చిన్న పరిశ్రమలకు బడ్జెట్ భరోసా!

- ఆటోనగర్‌లో ప్రధాని మోదీ ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం

**గాజువాక,మార్చి 3,ప్రభాతవార్త**




దేశంలోని చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి కేంద్ర బడ్జెట్ పెద్దపీట వేసిందని బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్,గాజువాక బీజేపీఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. మంగళవారం ఆటోనగర్ ఎంఎస్ఎంఈ కార్యాలయంలో ప్రధాని మోదీ ఖిపోస్ట్ బడ్జెట్ఖి ప్రసంగం ప్రత్యక్ష ప్రసారాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంఎస్ఎంఈల కోసం రూ 10,000 కోట్లతో ఖిగ్రోత్ ఫండ్ఖి ఏర్పాటు చేయడం చారిత్రాత్మక నిర్ణయమన్నారు. ఈ నిధి ద్వారా చిన్న పరిశ్రమలకు పెట్టుబడి కష్టాలు తీరడమే కాకుండా, అవి అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా ఈక్విటీ మద్దతు లభిస్తుందని వివరించారు. పాత పారిశ్రామిక క్లస్టర్లకు పునర్జీవం పోయడమే కేంద్ర లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ జెడీ సంతుల్ కుమార్, ఆర్‌బీఐ అధికారులు, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## జగన్ పర్యటనను విజయవంతం చేయండి

- గాజువాక వైకాపా సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పిలుపు

**గాజువాక,మార్చి 3,ప్రభాతవార్త**



మాజీ ముఖ్యమంత్రి, వైకాపా అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి బుధవారం విశాఖ పర్యటనకు వస్తున్న నేపథ్యంలో, పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని గాజువాక వైకాపా సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుధవారం ఉదయం 11 గంటలకు గాజువాక నాయకులు, కార్యకర్తలు షీలానగర్ పెట్రోల్ బంకు వద్దకు చేరుకోవాలని సూచించారు. అక్కడ నుంచి భారీ ర్యాలీగా విమానాశ్రయానికి చేరుకుని జగన్‌కు ఘనస్వాగతం పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు మంత్రి శంకరనారాయణ, పల్లా చినతల్లి, మొహమ్మద్ ఇమ్రాన్, బొడ్డ గోవింద్, మహేశ్వర రెడ్డి, అచ్చం నాయుడు, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా స్వర్ణ నూకాంబిక అమ్మవారి సారి ఊరేగింపు

**గాజువాక,మార్చి 3,ప్రభాతవార్త**



జీవీఎంసీ 74వ వార్డు దయాళ్‌నగర్‌లో వెలసిన శ్రీ స్వర్ణ నూకాంబిక అమ్మవారి 15వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఖిసారిఖి ఊరేగింపును గాజువాక ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. అంతకుముందు ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా ఇక్కడ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయం తరహాలోనే దయాళ్‌నగర్ ఆలయం అభివృద్ధి చెందడం సంతోషకరమని, తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. మంగళవాయిద్యాలు, భజనల మధ్య మహిళలు సారిని మాడవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ కార్పొరేటర్ బి ఎన్ పాత్రుడు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అనంతపద్మనాభస్వామి డోలాఉత్సవం

**పద్మనాభం, మార్చి3, ప్రభాతవార్త**



పద్మనాభం గ్రామంలో గత ఆరు రోజుల నుండి జరుగుతున్న అనంతుని వార్షిక తిరు కళ్యాణ ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం అనంతపద్మనాభస్వామి డోలాఉత్సవం ను అర్చకులు, భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చక బృందం, భక్తులు కుంతీమాధవస్వామి ఆలయ నుండి ప్రత్యేక పల్లకీలో శ్రీదేవి భూదేవి సమేత అనంతునిని వేంచేయించి గ్రామంలో రహదారిబంగ్లా వద్ద ఉన్న డోలామండపంనకి తీసుకెళ్లారు. అక్కడ స్వామికి అర్చకులు ఉయ్యాలు ఊపి పూజలు చేసారు. అనంతరం కన్నయ్య కోనేరులో స్వామికి చక్రస్నానం చేయించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మీ,నాయకులు తాలాడ పద్మనాభం,ఎర్రినాయుడు,సుమంతనాయుడు,అవనాపు రమణ, సన్నిబాబు,భక్తులు పాల్గొన్నారు.

## పద్మనాభంలో ఘనంగా హోలీ పండుగ

**పద్మనాభం, మార్చి 3,ప్రభాతవార్త**



పద్మనాభం మండలంలో వివిధ గ్రామాలలో మంగళవారం ప్రజలు హోలీ పర్వదినంను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యువతీ,యువకులు ఒకరికొకరు రంగులు జల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలిపుకున్నారు. అలాగే రంగునీలు కూడా ఒకరిపై ఒకరు జల్లుకున్నారు.

## జీవీఎంసీ పీజీఆర్ఎస్‌లో 103 వినతులు

- విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

**విశాఖపట్నం, మార్చి 2, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 103 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం పాత సమావేశ మందిరం లో అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ లతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 103 అర్జీలు / ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా భీమిలి జోన్ కు 01, మధురవాడ జోన్ కు 16, ఈస్ట్ జోన్ కు 22, వెస్ట్ జోన్ కు 04, నార్త్ జోనుకు 18, సౌత్ జోన్ కు 08, పెందుర్తి జోన్ కు 13, గాజువాక జోన్ కు 10 జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 11 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ అకౌంట్సు విభాగమునకు 05, రెవెన్యూ విభాగమునకు 16, ప్రజారోగ్య విభాగమునకు 05, పట్టణ ప్రణాళిక విభాగమునకు 51, ఇంజినీరింగు విభాగమునకు 19, మొక్కల విభాగమునకు 03, యుసిడి విభాగమునకు 04 కలిపి మొత్తంగా 103 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనంతరం నగర మేయర్ మాట్లాడుతూ ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ఫిర్యాదులను అదే రోజు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి అధికారులను, జోనల్ కమీషనర్లను ఆదేశించారు. అనంతరం జీవీఎంసీ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జోన్ల జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులతో మాట్లాడుతూ పలు జోన్లలో పి జి ఆర్ ఎస్ ఫిర్యాదులు పరిష్కారం ఆలస్యంపై వివరణ కోరుతూ వాటిని త్వరితగతిన పరిష్కరించాలని, అలాగే వస్తున్న ఫిర్యాదులే మరలా నమోదు కావడంపై ప్రత్యేక దృష్టి సారించి అటువంటి వాటి పై ఫిర్యాదుదారులతో సంప్రదించి వాటి నియంత్రణకు చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి నరేష్ కుమార్, సిసిపి ఏ.ప్రభాకర రావు, జాయింట్ డైరెక్టర్ విజయభారతి,ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి. వాసుదేవ రెడ్డి, డిసిఆర్ ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శి బి.వి.రమణ, ఎడిహెచ్ వాసుకి, స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, పర్యవేక్షక ఇంజనీర్లు, డిసీపీ లు, ఏసీపీ లు, యు సి డి ప్రాజెక్ట్ ఆఫీసర్ పి. ప్రసన్న వాణి, డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శాంతి కుమారి, బయాలజిస్ట్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రంప్ ప్రమాణ స్వీకార ముహూర్తంపై జ్యోతిష్య అంచనాలు... నిజమవుతున్నాయా?

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకార ముహూర్తాన్నిఆధారంగా చేసుకుని చేసిన జ్యోతిష్య అంచనాలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. నవగ్రహ సంచారాన్ని పరిశీలించి 2025 జనవరి 28న ఒక దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రముఖ అంతర్జాతీయ జ్యోతిష్యులు బ్రహ్మశ్రీ లక్కోజు శివరామ విశ్వకర్మ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ పరిపాలనలో అమెరికా ఇరుగుపొరుగు దేశాలతో సంబంధాలు ఉద్రిక్తతలకు దారితీస్తాయని, తరచూ టారిఫ్ల పెంపు, ఏకపక్ష నిర్ణయాలు, ప్రపంచ దేశాలతో రాజకీయఆర్థిక విభేదాలు పెరిగే అవకాశముందని అప్పట్లో ఒక పత్రిక ప్రకటన పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో నిరసనలు, ఆంక్షలు, దేశాల మధ్య రాకపోకలపై ప్రభావం ఉంటుందని ముందే జోష్యం చెప్పారు. అలాగే రష్యాఉక్రెయిన్, చైనాతైవాన్, పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్, ఇజ్రాయిల్ఇరాన్ ప్రాంతాల్లో ఉద్రిక్తతలు పెరిగి యుద్ధ మేఘాలు కమ్ముకునే అవకాశముందని హెచ్చరించారు. ఇదే క్రమంలో 2026 జనవరి 12న ఇచ్చిన మరో ఇంటర్వ్యూలో, జనవరి 15వ తేదీ నుంచి గ్రహగోచారం ప్రభావంతో శాస్త్ర సాంకేతిక రంగంలో అంతరాయాలు, బంగారంవెండి ధరల్లో హెచ్చుతగ్గులు, రూపాయి విలువ క్షీణత, స్టాక్ మార్కెట్ల ఒడిదుడుకులు, నిర్మాణరంగ మందగమనం చోటుచేసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా నిత్యావసర సరుకుల ధరలు పెరగవచ్చని, దేశాల మధ్య ఆంక్షలు పెరిగే అవకాశముందని అన్నారు. భారతదేశం చుట్టూ ఉన్న దేశాల పరిస్థితుల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ప్రపంచ రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ జ్యోతిష్య అంచనాలు ఎంతవరకు నిజమవుతాయన్నది వేచిచూడాల్సి ఉంది.

## జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తాం

- ఎమ్మెల్యే, జనసేన విశాఖ నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చిన ఉద్యమి సభ్యత్వ నమోదు పై సౌత్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి, ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశం సీతంపేట పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి విశాఖ పార్లమెంట్ జనసేన ఉద్యమి సభ్యత్వ ఇన్‌ఛార్జ్, సౌత్ ఎమ్మెల్యే, జనసేన విశాఖ నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. పార్టీ లో సభ్యత్వం ఆధారంగా ప్రతి ఒక్కరికి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. వార్డు అధ్యక్షులు తో పాటు వివిధ పదవులలో ఉన్న ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని అన్నారు. సభ్యత్వం ద్వారా పార్టీ బలోపేతం తో పాటు జనసేన పార్టీ శ్రేణులకు బరోసా ఇవ్వడానికి కీలకం అని వివరించారు. కార్యక్రమంలో సభ్యత్వ నమోదు లక్ష్యాలు, నియోజకవర్గ కార్యాచరణ ప్రణాళిక కు సంబంధించిన అంశాలు వివరించారు. జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా పార్టీ పటిష్టతకు దోహదపడాలని, బూతు స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాలని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ సభ్యత నమోదు అత్యంత ముఖ్యమని , దీనివలన ప్రజల వద్దకు పార్టీని మరింత చేరువగా తీసుకెళ్లే అవకాశం గా భావించాలనీ తెలిపారు.అదేవిధంగా సభ్యత నమోదు ద్వారా రాబోయే రోజుల్లో జన సైనికులు నాయకులుగా మారే పరిణామం జరుగుతుందని అన్నారు. గౌరవ శ్రీ పవన్ కళ్యాణ్ గారు ఎన్నో త్యాగాలు చేసి సాహసపెతమైన పోరాటం చేసి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని భవిష్యత్తులో మరింత ప్రజా సేవ చేసే క్రమంలో జనసేన పార్టీ నాయకులకు అధికార పదవులు వచ్చే క్రమానికి ఈ సభ్యత నమోదు చాలా కీలకమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎస్ ఏ రెహమాన్ గారు, కార్పొరేటర్లు కందుల నాగరాజు గారు, ఆళ్ల లీలవతి గారు, వసంత లక్ష్మీ జీకే గారు, మేరీ జోన్స్ రాజుగారు, స్టేట్ డైరెక్టర్లు శ్రీమతి రూప గారు, లక్ష్మీ గారు, పశ్చిమ నియోజవర్గం నుంచి సీనియర్ నాయకులు శ్రీ భాస్కరరావు గారు, సురేష్ గారు వివిధ హోదాల్లో ఉన్న జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు...

## ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు దుర్మార్గం

- విశాఖపట్నంలో ఇస్కఫ్ నిరసమృతులకు కొవ్వొత్తులతో నివాళి

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా చేస్తున్న దాడులను తక్షణమే ఆపేయాలని భారత సాంస్కృతిక స్నేహ సహకార సంఘం (ఇస్కఫ్) విశాఖ జిల్లా సమితి డిమాండు చేసింది. ఈ మేరకు సోమవారం సాయంత్రం నగరంలోని గురజాడ విగ్రహం వద్ద ప్రపంచం శాంతినీ కోరుతూ, యుద్ధంలో కన్నుమూసిన మానవాళికి కొవ్వొత్తుల తో నివాళి అర్పించింది.ఈ సందర్భంగా ఇస్కఫ్ జాతీయ ఉపాధ్యక్షులు,జే వీ ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి సనపల నరసింహులు, జిల్లా అధ్యక్ష కార్యదర్సులు సి ఎన్ క్షేత్రపాల్ రెడ్డి, కే సత్యాంజనేయ మాట్లాడుతూ అమెరికా అనుసరించే సామ్రాజ్యవాద, దురాక్రమణ పూరిత చర్యల్లో భాగంగానే ప్రపంచంలో శాంతి లేకుండా పోతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఆయిల్ నిక్షేపాల కోసమే కుంటి సాకులతో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్తంగా, ఏకపక్షంగా దాడులకు తెగబడ్డాయని పేర్కొన్నారు. ఈ దాడిలో అమాయక పౌరుల ప్రాణాలు పోతున్నాయని పేర్కొన్నారు. ఒకదేశం పై మరో దేశం దాడి చేయడం అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించారు.నిత్యం ప్రపంచం దేశాల మధ్య యుద్ధాలను సృష్టిస్తూ ప్రపంచంలో అశాంతికి అమెరికా, ఇజ్రాయిల్ దేశాలే కారణమవుతున్నాయన్నారు. లక్షలాది మంది ప్రాణాలను యుద్ధాల పేరుతో బలి తీసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ శాంతికి విఘాతం కలిగించే పద్ధతుల్లో సామ్రాజ్యవాద దురాక్రమణలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవలే వెనెజులా అధ్యక్షుడు మధురోను, ఆయన భార్యను అమెరికా కిడ్నాప్ చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడు ఇరాన్‌పై దాడికి తెగబడిందని తెలిపారు. శాంతి కాముకుడినని, తనకే నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని కోరిన ట్రంప్ ఇలాంటి ఉన్మాద యుద్ధాలకు దిగడం సిగ్గు చేటని పేర్కొన్నారు. ప్రపంచ శాంతిని కోరుకునే వారు అంతా ఈ దాడులను ఖండించాలని కోరారు. ప్రపంచం శాంతి కోసం గళమెత్తుదామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఇస్కఫ్ జిల్లా నేతలు మధుమతి, సాయిప్రియ, శ్యాంసుందర్, ఏన్ నాగభూషణం, నల్లయ్య, అప్పన్న, వామన మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలో మితిమీరుతున్న భూకబ్జాలు దేవస్థానం భూమికి రక్షణ కరువాయే



మాజీమంత్రి గుడివాడ అమర్నాథ్

అనకాపల్లి మార్చి 3 ;(ప్రభాత వార్త) కూటమి ప్రభుత్వంలో భూకబ్జాలు మితిమీరి పోతున్నాయని, 100 కోట్లు విలువైన దేవస్థానం భూమిని కబ్జా చేయడానికి రెవెన్యూ అధికారులు కూడా కీలకపాత్ర వహించడం అన్యాయమని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డులో వివాదంలో ఉన్న కన్యకా పరమేశ్వరి సత్రం పేరిట ఉన్న స్థలాన్ని మంగళవారం మాజీ మంత్రులు గుడివాడ అమర్నాథ్, బూడి ముత్యాల నాయుడు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, కంబాల జోగులు చింతలపూడి వెంకటరామయ్య, మాజీ ఎంపీ డాక్టర్ బి వి సత్యవతి అనకాపల్లి వైసిపి నియోజకవర్గ ఇన్చార్జి మలసాల భరత్ కుమార్, వైసిపి పార్లమెంటరీ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ నడి నడిబొడ్డులో 100 కోట్లు విలువైన దేవస్థానం భూమిని అధికారులతో కలిసి కూటమి నాయకులు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే అనకాపల్లి ప్రజలు చూస్తూ ఊరుకోరని, దేవస్థానానికి ఆ భూమి చెందే వరకు వైసిపి తరుపున పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. దేవస్థానానికి చెందిన భూమి అని రికార్డులలో స్పష్టంగా ఉంటే రెవెన్యూ అధికారులు వీఆర్వో దగ్గరనుంచి కలెక్టర్ వరకు ఏ విధంగా ప్రొసీడింగ్ ఆర్డర్స్ ఇచ్చారని ఈ సందర్భంగా ప్రశ్నించారు. వీరుపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంత జరుగుతున్నా కూటమి నేతల్లో కనీసం చలనం లేకపోవడం పట్ల అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, కె ఎం నాయుడు, కొణతాల మురళీకృష్ణ, మల్ల బుల్లి బాబు వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి మార్చి 3 (ప్రభాత వార్త)



గ్రామాల్లోని అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యం అని మాజీ మంత్రి స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ అన్నారు. మంగళవారం అనకాపల్లి మండలంలో సుమారు 2 కోట్ల 57లక్షల. 50,000 పలు ప్రారంభోత్సవాలు శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. మామిడిపాలెం గ్రామంలో 1 కోటి 47.లక్షల 50,000 రూపాయలతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష నిధులతో నూతన తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ గ్రామపంచాయతీ నిధులతో నూతన సచివాలయం, ఎస్సీ కాలనీలో పార్కు ప్రారంభోత్సవం చేశారు.తగరంపూడి గ్రామంలో ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ తగరంపూడి ఉత్తమ గ్రామ పంచాయతీ అభివృద్ధి నిధులు 1 కోటి 10 లక్షలు రూపాయలతో పలు అభివృద్ధి పనుల్లో భాగంగా కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ శాసన మండల సభ్యులు బుద్ద నాగ జగదీష్, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర , డిసిఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ , మండల టిడిపి అధ్యక్షులు కర్రి బాబి, ప్రభుత్వ అధికారులు, ఏ ఈ స్కూల్ ఉపాధ్యాయులు, సచివాలయం ఉద్యోగులు, మండలం కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సంతానం లేకపోవడంతో మనోవేదనకు గురై వివాహిత మృతి

(రాంబిల్లి మార్చి 03 ప్రభాతవార్త)



మండల కేంద్రం రాంబిల్లిలో నివాసముంటున్న వివాహిత సాయిని తేజ (23) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిందని స్థానిక సీఐ సిహెచ్. నరసింగరావు చెప్పారు, ఆయన కథనం మేరకు శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం సాయినివానిపేట గ్రామానికి చెందిన హిమారావు, సాయిని తేజ దంపతులు రాంబిల్లి లో నివాసం ఉంటున్నారు, సాయిని తేజ భర్త హిమారావు నావికస్థావరం ప్రాజెక్టులో పని చేస్తున్నాడు, పెళ్లయి ఐదేళ్లు అవుతున్న పిల్లలు పుట్టకపోవడంతో మనస్థాపానికి గురై ఎవరూ లేని సమయంలో సాయినీ తేజ బలవన్మరణానికి పాల్పడిందని సిఐ చెప్పారు, సోమవారం ఆమె ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని చెప్పారు, స్థానికులు ఆమెను అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారన్నారు, ఆసుపత్రి వర్గాలు ఇచ్చిన సమాచారం మేరకు మంగళవారం అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో ఆమె మృతి పై వివరాలు అడిగి తెలుసుకున్నాం అన్నారు, మృతిరాలు సోదరుడు సుందర రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు, మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని ఆయన తెలిపారు.

## మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి: "వాసుపల్లి"

(నక్కపల్లి రూరల్ ,ప్రభాతవార్త )



ఏప్రిల్ 8 9 తేదీల్లో శ్రీశైలంలో జరిగే మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర స్థాయి మహాసభలను జయప్రదం చేయాలని సంక్షేమ సమితి రాష్ట్ర యూత్ అధ్యక్షులు వాసుపల్లి శివాజీ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని రాజయ్యపేట గ్రామంలో యువకులతో సమావేశం నిర్వహించి చర్చించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలంలో ఏప్రిల్ 8,9 తేదీల్లో జరిగేటువంటి మత్స్యకార సంక్షేమ సమితి 21వ రాష్ట్ర సర్వసభ్య సమావేశాలలో ప్రధానంగా మత్స్య నారాయణ జయంతి ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కమిటీల, గ్రామ కమిటీల ఏర్పాటుతోపాటు సభ్యత్వాలు పూర్తిచేయాలని సమావేశంలో జిల్లాల వారీగా చర్చించారు. సంఘ నిర్మాణ విషయంలో ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఉమ్మడి మహేష్ మాట్లా డుతూ మహాసభ జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు సిరిపిల్ల అప్పలరాజు, కారే ధార్రాజు,వాసుపల్లి రాజు, మైలపల్లి ప్రసాద్ , పీక్కి లోకనాథం,తండెల అప్పలరాజు, బొంది దార్ల, వాసుపల్లి బంగార్రాజు, వాసుపల్లి వెంకటేష్ లు పాల్గొన్నారు.

## ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధలు తీసుకోవాలి .. డి.ఎస్.పి.ఎం శ్రావణి

అనకాపల్లి రూరల్ మార్చి 3: (ప్రభాతవార్త)

పోలీస్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధలు తీసుకోవాలని డి.ఎస్.పి ఎం శ్రావణి సూచించారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో మహిళ సంరక్షణ కార్యదర్శులకు, అనకాపల్లి సబ్ డివిజన్ పరిధిలో గల వివిధ పోలీస్ స్టేషన్లలో పని చేస్తున్న మహిళ పోలీస్ సిబ్బందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్యాలయం డి సి హెచ్ ఎస్ డాక్టర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ మానస, డాక్టర్ అశ్విని పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి ఎం శ్రావణి మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా శారీరక , మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనకాపల్లి సబ్ డివిజన్ పరిధిలో గల వివిధ పోలీస్ స్టేషన్లలో హోమ్ గార్డ్ ర్యాంక్ నుండి ఏఎస్ఐ ర్యాంక్ వరకు పని చేస్తున్న మహిళా పోలీస్ సిబ్బంది మొత్తం 60 మంది ఈ ఆరోగ్య శిబిరంలో పాల్గొన్నారు. వారికి సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ జి ప్రేమ్ కుమార్, ట్రాఫిక్ ఇనస్పెక్టర్ వెంకట నారాయణ, ఎస్.ఐ. వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు...



ఎలమంచిలి , మార్చి 03,ప్రభాతవార్త

అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎలమంచిలి సర్కిల్ పరిధిలో గల మహిళా సిబ్బంది అందరికీ సిహెచ్ ఆసుపత్రిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై సావిత్రి, రూరల్ ఎస్సై ఉపేంద్ర , మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తల అరెస్టులు - హక్కులపై దాడి

(రాంబిల్లి మార్చి 03 ప్రభాతవార్త)




మండల కేంద్రంలో అంగన్వాడి కార్యకర్తల అరెస్టులను ఖండిస్తూ సిఐటియు నాయకులు నిరసన తెలియజేశారు, కూటమి ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని విజయవాడలో శాంతి యుతంగా, జీతాలు పెంచాలని నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు మరియు సహాయకులను దుర్మార్గంగా అరెస్టు చేయడం అన్యాయమని సిఐటియు జిల్లా కార్యదర్శి జి. దేవుడు నాయుడు ఖండించారు, అంగన్వాడీ కార్యకర్తల అరెస్టును నిరసిస్తూ రాంబిల్లి ప్రధాన కూడలిలో మంగళవారం ఆందోళన చేపట్టారు, గత వైకాపా ప్రభుత్వంలో 42 రోజులపాటు దీక్షలు చేపట్టిన శిబిరం వద్దకు వచ్చి అంగన్వాడీలను పరామర్శించిన నేటి నాయకులు వచ్చేది తమ ప్రభుత్వమేనని మీ అందరికీ మంచి చేస్తామని హామీలు ఇచ్చి చెయ్యకపోగా, ఇప్పుడు వాటిని అమలు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు నిరసనలకు దిగితే అరెస్టు చేయడం తీవ్ర అన్యాయమని సిఐటియు నాయకులు మండిపడ్డారు, గతంలో అంగన్వాడీల పట్ల వైకాపా ప్రభుత్వం వ్యవహరించిన మాదిరే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అనుసరిస్తుందని విమర్శించారు, ప్రభుత్వం ఇప్పటికైనా ఇటువంటి దుర్మార్గ చర్యలు మానుకొని అరెస్టులు వెనక్కి తీసుకొని అంగన్వాడీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు, ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై రాము, నూకరాజు, రాంబాబు, శివాజీ, అంగన్వాడి కార్యకర్తలు మరియు సహాయకులు పాల్గొన్నారు.

## సర్పంచ్ చొరవతో ఆక్రమణకు అడ్డుకట్ట

మాకవరపాలెం మార్చి 3 ప్రభాతవార్త



మండల కేంద్రం మాకవరపాలెం గ్రామాన్ని ఆనుకొని ఉన్న కవుశెట్టి వాని చెరువు ఆనుకొని ఉన్న గ్రామ కంఠం భూమిపై అక్రమార్కుల కన్ను పడింది. మాకవరపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 171లో సుమారు 40 సెంట్లు గ్రామ కంఠం భూమిని కొంతమంది కాజేసేందుకు ప్రయత్నించారు. మాకవరపాలెం సర్పంచ్ అల్లంపల్లి శిరీష చొరవతో ఆక్రమణ భూమిని అడ్డుకట్ట వేస్తూ బోర్డులు ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి మాకవరపాలెం కవిశెట్టి వాని చెరువు అనుకొని ఉన్న భూమిని ఆక్రమించేందుకు కొంతమంది జెసిపి సహాయంతో సదులు చేసే ప్రయత్నం చేశారు. గ్రామానికి చెందిన కొంతమంది రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా అప్పట్లో ఆక్రమణలు తాత్కాలికంగా నిలిపివేశారు. చెరువుకు సరిహద్దులు ఏర్పాటు చేయాలని అభ్యర్థన మేరకు తాసిల్దార్ ఆదేశాలతో రెవెన్యూ సర్వే అధికారులు సరిహద్దు నిర్ణయించారు. ఆక్రమణకు గురవుతున్న మిగిలిన భూమి గ్రామ కంఠంలోనిదిగా రెవెన్యూ అధికారులు తేల్చారు. దీంతో మాకవరపాలెం సర్పంచ్ అల్లంపల్లి శిరీష మరి కొంత మంది పెద్దలు సహకారంతో పంచాయతీ కార్యదర్శితో కలిసి గ్రామ కంఠం భూమిని అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా సంబంధిత భూమిలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ అల్లంపల్లి శిరీష మాట్లాడుతూ లక్షలాది రూపాయలు విలువచేసే గ్రామ కంఠం భూమిపై కొందరు అక్రమార్కులు కన్ను పడిందన్నారు. ప్రజా ప్రయోజనాలకు అనుకూలమైన గ్రామ కంఠం భూమిని పంచాయతీ స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. విలువైన గ్రామకంఠం భూములో ఎటువంటి ఆక్రమణలకు తావు లేకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సదరు భూమిని ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రజలకు అవసరమైన కార్యక్రమానికి ఉపయోగించాలని నిర్ణయించినట్లు సర్పంచ్ శిరీష తెలిపారు.

## నిర్బంధాల కంచె దాటి... అంగనవాడి ఉద్యమ వేడి

బుచ్చయ్యపేట ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



అంక్షల కంచెను పెకలించుకుని,మండే ఎండను సైతం లెక్క చేయక కదం తొక్కి మరీ ఉద్యమ వేడిని రగిలించారు.రాష్ట్రవ్యాప్తంగా ఉండే అంగన్వాడి అందరికీ కనీస వేతనం 26,000 ఇవ్వాలని గత ప్రభుత్వ హయాంలో ధర్నాలు చేస్తున్నప్పుడు అంగన్వాడీ టీచర్ల టెంట్ వద్దకు వచ్చి చంద్రబాబు నాయుడు నారా లోకేష్ మా ప్రభుత్వం అధికారులకు వచ్చిన తర్వాత అంగన్వాడీలకు కనీస వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని తెలిపారు.ఇప్పుడు అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న మా సమస్యలు పరిష్కారం చేయండని అంగన్వాడీలు శాంతియుతంగా ధర్నా చేస్తున్న అంగన్వాడీలను అరెస్టు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు.ఈ అరెస్టులు తో అంగన్వాడి టీచర్లు భయపెట్ట లేరని మా సమస్యలు పరిష్కారం చేయకపోతే మరింతగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి లో ధర్నా చేసి మానవహారంగా ఏర్పడ్డారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు.ఈ కార్యక్రమం లో యూనియన్ నాయకులు వరలక్ష్మి అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు పాలుగున్నారు.

## జాలీగా హోలీ...

### మున్సిపాలిటీ, మండల పరిధిలో యువత ఆధ్వర్యంలో ఘనంగా హోలీ ...

ఎలమంచిలి, మార్చి 03,ప్రభాతవార్త



మున్సిపాలిటీ పరిధిలోను, మండలంలో యువత ఆధ్వర్యంలో హోలీ పండుగ ఘనంగా నిర్వహించారు. వసంతం రాకతో రంగుల పండుగ వచ్చేసింది హోలీ అంటే కేవలం పండుగ కాదు చెడుపై మంచి గెలుపునకు నిదర్శనం. హోలీ స్నేహానికి వినోదానికి చిహ్నంగా మారిపోయింది. సమస్యలన్నీ మర్చిపోయి ఆనందంగా గడపడానికే ఈ హోలీ పండుగను యువత ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీలోని 23వ వార్డు అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ పాటుపడే గ్రామ జ్యోతి యువత ఈ హోలీ పండుగను కొక్కిరాపల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన.!

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకుని, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా మహిళా సాధికారత, ఆరోగ్యం సామాజిక బాధ్యతపై ప్రత్యేక కార్యక్రమాలు సీఐ జూరెడ్డి మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు అందులో భాగంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం తోపాటు రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన శిబిరాన్ని డిఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. నక్కపల్లి సర్కిల్ పోలీస్ స్టేషన్ వద్ద ఉచిత వైద్య శిబిరంతో పాటు నిర్వహించిన రక్తదాన శిబిరంలో అనేకమంది వైద్య పరీక్షలు చేయించుకోవడమే కాకుండా ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం డిఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాస్ చేతుల మీదుగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి సత్కరించి ధ్రువపత్రాలు అందజేశారు . జిల్లాలోని నక్కపల్లి సర్కిల్ తో పాటు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మహిళా పోలీసులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ప్రజల భాగస్వామ్యంతో రక్తదాన శిబిరాలు, ఉచిత ఆరోగ్య పరీక్షలు అవగాహన సదస్సులు విజయవంతంగా నిర్వహించారు . నక్కపల్లి నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఇన్స్పెక్టర్ మురళి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్సైలు సన్నీ బాబు, సాహిబా అంజుమ్‌లు రాహుల్ లాపరోస్కోపీ హాస్పిటల్ (తుని), మదర్ బ్లడ్ సెంటర్ సహకారం అందించడంతో వారిని అభినందించారు. శిబిరంలో వైద్య సిబ్బంది రక్తదాన శిబిరం, ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేయడం పట్ల సీఐ మురళి సంతోషం వ్యక్తం చేశారు. ఈ వైద్య శిబిరంలో పోలీస్ అధికారులతో పాటు యువకులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు.







## వెంకటేశ్వర స్వామివారి సేవలో "వీసం" బ్రదర్స్.!

నక్కపల్లి, ప్రభాతవార్త



మండలంలోని ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలలో భాగంగా మంగళవారం మండలంలోని రాజయ్యపేట సముద్ర తీరానికి చక్రస్నానానికి బయలుదేరిన స్వామి వారి పల్లకిని రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి వీసం రామకృష్ణ తోపాటు సోదరుడు మండల పరిషత్ ఉపాధ్యక్షులు నానాజీలు భుజంపై ఎత్తుకొని స్వామివారి సేవలో పాల్గొన్నారు. స్వామివారి పల్లకి మోసే భాగ్యం దక్కినందుకు ధన్యులను అంటూ సంతోషం వ్యక్తం చేశారు.

## ఉపమాక వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న" సీరం"

నక్కపల్లి, ప్రభాతవార్త



ఉపమాక వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవ భాగంగా బుధవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ,మండల పార్టీ అధ్యక్షులు సీరం నరసింహ మూర్తితో పాటు రాష్ట్ర పార్టీ నాయకులు చిక్కాల రామారావులు దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని భుజం మీద ఎత్తుకొని సేవలో పాల్గొన్నారు.

## అన్నదాన శిబిరానికి పోటెత్తిన భక్తులు

( నక్కపల్లి, ప్రభాతవార్త)



ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణోత్సవంలో భాగంగా బుధవారం మండలంలోని రాజయ్యపేట సముద్ర తీరంలో చక్రస్నానంతో పాటు పౌర్ణమి కి వచ్చే భక్తుల కోసం ఉపమాక గ్రామం దాతలు సహకారంతో పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో మెరక వీధిలో ఏర్పాటుచేసిన భారీ అన్న సమారాధనకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కొప్పిశెట్టి బుజ్జి దగ్గరుండి భక్తులకు అన్నప్రసాదాలను అందించారు. అన్న సమారాధనకు తరలి వచ్చిన వేలాది మంది భక్తులకు అన్న ప్రసాదాలు అందించేందుకు ముందుకు వచ్చిన దాతలు బుజ్జి గ్రామ పెద్దలు చేతుల మీదుగా సత్కరించారు.

## సంపూర్ణ చంద్ర గ్రహణంతో మూతపడిన దేవాలయాలు



అనకాపల్లి మార్చి 3 (ప్రభాత వార్త)

సంపూర్ణ చంద్రగ్రహణంతో మంగళవారం ఉదయాన్నే అనకాపల్లి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దేవాలయాలు మూతపడ్డాయి. అనకాపల్లి నూకాంబిక ఆలయం, వేల్పుల వీధి కాశీ విశ్వేశ్వర ఆలయం, భోగలింగేశ్వర స్వామి ఆలయం, దేవుని గుమ్మం వెంకటేశ్వర స్వామి ఆలయం, గాంధీనగరం వెంకటేశ్వర స్వామి ఆలయం, శారదా నది ఒడ్డున ఉన్న ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం ఇలా అన్ని ఆలయాలు మూసివేశారు. మరల బుధవారం ఉదయం ఆయా ఆలయాల్లో సంప్రోక్షణ శుద్ధి చేసి యధావిధిగా దర్శనాలు కొనసాగనున్నాయి.

## నర్సీపట్నంలో అంగన్వాడీలు నిరసన కార్యక్రమం

నర్సీపట్నం,మార్చి 03,ప్రభాతవార్త



విజయవాడలో అంగన్వాడీలు నిర్వహించిన ధర్నా శిబిరం వద్ద మంగళవారం తెల్లవారుజామున కరెంట్ కట్ చేసి వేలాది మంది అంగన్వాడీలను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడాన్ని నిరశిస్తూ ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో నర్సీపట్నంలో అంగన్వాడీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం అబీద్ సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. కనీసం తమ గోడు వినిపించుకోవడాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం సహించలేకపోతుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అంగన్వాడీ శిబిరాలు వద్దకు వచ్చి మద్ద ఇచ్చి కూటమి ప్రభుత్వం చంద్రబాబు నిర్బంధం విధించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కావున న్యాయమైన అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి, కనీస వేతనాలు పెంచాలని, ప్రభుత్వ అంగన్వాడీలు ఉద్యోగులనే దాన్ని ప్రభుత్వ వెబ్ లైట్ నుంచి తొలగించాలని సంక్షేమ పథకాలు అమలు చేయాలి డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో మరింత ఉద్యమన్ని మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి, అంగన్వాడి యూనియన్ నాయకుల వి.సామ్రాజ్యం, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరీ, ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రెటరీ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా డ్రోన్ తనిఖీలు



నర్సీపట్నం,మార్చి 03,ప్రభాతవార్త

నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం రూరల్ సర్కిల్ పరిధిలోని నెల్లిమెట్ట, గబ్బాడ, రావణపల్లి, ఏటిగైరంపేట పరిసర ప్రాంతాల్లో డ్రోన్ తనిఖీలు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా అరికట్టడంలో భాగంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టామని సీఐ తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంటుందని పేర్కొన్నారు.

## ఎస్సీ బాలికల వసతి గృహంలో అవగాహన కార్యక్రమం

నర్సీపట్నం,మార్చి 03,ప్రభాతవార్త



మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా టౌన్ పోలీసులు శివపురం ఎస్సీ బాలికల వసతి గృహంలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ షేక్ గఫూర్ డయల్ 112 అత్యవసర సేవలు, షీ టీమ్స్, శక్తి యాప్, మహిళల రక్షణకు అవసరమైన చట్టాలపై అవగాహన కల్పించారు. ఎలాంటి వేధింపులు లేదా సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ ఉమామామహేశ్వరరావు పాల్గొన్నారు.

## దారెల పంచాయతీ కేంద్రంలోఅంగరంగ వైభవంగా హోలీ జాతర

### జగన్నాథ స్వామి ప్రత్యేక పూజలు చేసిన భక్తులు, దారేల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి



ముంచంగి పుట్టు మార్చి 3 (ప్రభాతవార్త)

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయతీ కేంద్రంలో గత 1962 సంవత్సరం నుండి జరుపుతున్న జగన్నాథ స్వామి మహోత్సవం హోలీ మహోత్సవం వేడుకలు దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా పంచాయతీ ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒరియా నాటకం (శ్రీకృష్ణుని జీవిత చరిత్ర) గిరిజన సాంప్రదాయ సాంస్కృతిక నృత్యాలతో మారుమోగింది .అయితే బుధవారం తెల్లవారుజామున బూరుగు కర్రలతో పేర్చి పోగున్ మంట కాల్చారు పూర్వికులు తరతరాల నుంచి శతాబ్ద కాలం నుంచి జరుపుతున్న హోలీ పండుగను ఒకరిని ఒకరు రంగులు రాసుకుంటూ ఒకరికొకరు హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు .అనంతరం పాండురంగ స్వామి మాట్లాడుతూ జగన్నాథ స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరి పైన ఉండాలని అందరికీ హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు, జగన్నాథ స్వామి దయవల్ల అందరూ సుఖసంతోషాలతో ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేసి వచ్చిన భక్తులకు అన్న సమరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి డివిజన్ నాయకులు దారేల సర్పంచ్ పాంగి పాండురంగస్వామి మాజీ ఎంపీటీసీ పాంగి శాస్త్రి బాబు ఉత్సవ కమిటీ సభ్యులు యువరాజు, ఆనంద్, శంకర్, రమేష్, చెట్టి భాస్కర్, సామారెడ్డి ఆనంద్, కాంతారి నాగరాజు, మనోజ్, మురళి, అశోక్, గోపాల్, సూరి, పాంగి నారాయణ,వైకుంఠం, శ్రీను బుట్టో, సుమన్, చెందా మోహన్, దామోదరం, అలాగే అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పాడేరు ఘనంగా హోలీ సంబరాలు

### రంగులు జల్లుకుంటూ..రంగునీళ్లతో ఎంజాయ్ చేసిన పిల్లలు..పెద్దలు

పాడేరు,మార్చి3,ప్రభాతవార్త:



అల్లూరిసీతారామ రాజు జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో ఉన్న అర్ అండ్ బి క్వార్టర్స్ లో హోలీ సంబరాలను పిల్లలు పెద్దలతో పాటు ఘనంగా జరుపుకున్నారు.చిన్నారులు వివిధ రకాల రంగులను ఇళ్ల నుంచి తెచ్చుకొని ఒకరికొకరు రంగులు మొఖానికి పూసుకుంటూ..ఒకరిపై ఒకరు రంగులను జల్లు కుంటు సరదాగా గడిపారు.అలాగే రంగునీళ్లను ఒకరిపై ఒకరు జల్లు కుంటు హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.హోలీ సంబరాలతో ఈ ప్రాంతం అంతా సందడిగా మారింది.

## చింతపండు కేజీకి రూ.100 మద్దతు ధర కల్పించాలి

### జిసిసి డివిజనల్ మేనేజర్‌కి సిపిఎం పార్టీ ప్రతినిధి బృందం వినతిపత్రం

పాడేరు,మార్చి3,ప్రభాతవార్త



చింతపండు కిలో 100రూపాయలు మద్దత్తు ధర ప్రకటించాలాని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేస్తు పాడేరు జీసీసీ డి ఎం కృష్ణ ప్రసాద్ కి సిపిఎం పార్టీ అల్లూరి జిల్లా కార్యదర్శి పి. అప్పల నరస వినతి పత్రం అందజేసారు. జీసీసీ పాడేరు కార్యాలయం లో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వంతలా దాస్, చిన్నరావు, లాలీబాబు తో కలిసి పార్టీ జిల్లా కార్యదర్శి పి. అప్పల నరస వినతి పత్రం ఆదివారం అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో వేలాది గిరిజన (ఆదివాసీ) కుటుంబాలు చింతపండు సేకరణలి. పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఇది నాన్-టింబర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ (ఎన్ టి ఎఫ్ పి లో ప్రధానమైనదన్నారు.. అడవి చింత చెట్ల నుంచి సేకరించే ఈ ఉత్పత్తి గిరిజనులకు అదనపు ఆదాయం కల్పిస్తుంది. కానీ గిరిజన సహకార సంస్థ (జి సి సి ) తక్కువ ధరలు చెల్లించడం, మధ్యవర్తుల దోపిడీ వల్ల గిరిజనులు తీవ్ర నష్టపోతున్నారు.ఫిబ్రవరి చివరి నుంచి మే నెల వరకు సీజన్ పూర్తి స్వరంలో ఉంది. ఈ ఏడాది దిగుబడి మంచిగా ఉంది.గిరిజన మహిళలు, పురుషులు అడవి చెట్లు ఎక్కి కర్రలతో కొట్టి లేదా కింద పడిన పండ్లు సేకరిస్తారు. ఎండలో ఆరబెట్టి, శుభ్రం చేసి తట్టలు/సంచుల్లో నింపి మార్కెట్‌కు తీసుకెళ్తారు.ఒక్క చెట్టు నుంచి సగటున రూ.200-600 రూపాయల వరకు ఆదాయం వస్తుంది. పాడేరు డివిజన్ (పాడేరు, హుకుంపేట), చింతపల్లి డివిజన్‌లలో అత్యధిక సేకరిస్తారు. వేలాది గిరిజన కుటుంబాలు (ముఖ్యంగా మహిళలు) ఈ పనిపై ఆధారపడతారన్నారు. గిరిజనుల ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభం. అడవి సంరక్షణకు కూడా ఉపయోగపడుతుంది.ఇటువంటి పరిస్థితి లో జి సి సి కొనుగోలు ధరలిలి: కేజీకి రూ/-34 నుంచి రూల్- 36 మాత్రమే (సీడెడ్ తమరిండ్). గత సంవత్సరాలతో సమానం గా ఉంది. ఈ ఏడాది ఎలాంటి పెంపుదల లేకపోవడం దారుణం.స్థానిక ప్రైవేట్ వర్తకులు / సంతాల్లో 45 నుంచి 70 / కేజీ రూపాయల వరకు ఉందఅఘ్ఘుతీబ. విశాఖ లో రిటైల్ మార్కెట్ ధర 150 నుంచి 250o / కేజీ రూపాయల వరకు ఉందన్నారు. జి సి సి ధర మార్కెట్ ధరలో కేవలం 1/3 భాగం మాత్రమే! గిరిజనులు మధ్యవర్తుల చేతుల్లో మోసపోతున్నారు. రవాణా, నిల్వ, ఎండబెట్టడం సౌకర్యాలు లేకపోవడం వల్ల మరింత నష్టం. తక్కువ ధరలతో గిరిజన కుటుంబాలు ఆకలి, రుణాలతో బాధపడుతున్నారు.మధ్యవర్తుల దోపిడీ, జి సి సి మోనపాలీ ఉన్నా అమలు లోపాలు తో పాటు రవాణా, ప్రాసెసింగ్ (సీడ్‌లెస్), మార్కెటింగ్ సౌకర్యాలు లేవు.వాతావరణ మార్పులు, అడవి సంరక్షణ సమస్యలు తీవ్రంగా ఉందనీ ఈ నేపథ్యంలో సిపిఎం పార్టీ గిరిజనుల ఆదాయాన్ని రక్షించేందుకు లిలిచింతపండు కొనుగోలు ధరను కేజీకి 100 మద్దతు ధరగా వెంటనే కల్పించాలని డిమాండ్ చేస్తూ, సిపిఎం పార్టీ ప్రతినిధి బృందం గిరిజన సహకార సంస్థ (జి సి సి ), పాడేరు డివిజనల్ మేనేజర్ కృష్ణ ప్రసాద్ కి వినతిపత్రం సర్పించడం జరిగింది.ప్రస్తుత ధరలతో గిరిజనుల జీవనం దుర్భరం. రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ, ఐటిడిఎ,జి సి సి అధికారులు వెంటనే స్పందించాలనీ లేదంటే ఉద్యమాలు, ధర్నాలు చేపట్టవలసి వస్తుందని హెచ్చరిస్తున్నామన్నాడు.

## అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అక్రమ అరెస్టులు కండిస్తూ పాడేరులో నిరసన

పాడేరు,మార్చి3,ప్రభాతవార్త:



అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విజయవాడ అలంకార్ సెంటర్ లో శాంతి యుతంగా నిరసన చేపడుతున్న అంగన్వాడీ కార్యకర్తలను పోలీసులు అక్రమ అరెస్టులు కండిస్తూ పాడేరులో నిరసన చేశారు.వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం పాడేరు ప్రాజెక్టు పరిధిలో గలా అంగన్వాడీ కార్యకర్తలు పాడేరు పాత బస్టాండ్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ కార్యమనికి ఉద్దేశించి సిఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి లింగేరి.సుందరరావు,అంగన్వాడీ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి చిన్నారి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి నేటికి రెండు సంవత్సరాలు అయినప్పటికీ అంగన్వాడీ సమస్యలు పరిష్కరించాలేదని అన్నారు.కనీస వేతనం 26000 ఇవ్వాలి! ఎన్నికల వాగ్దానం అమలు చేయాలని సిఐటియు డిమాండ్ చేసారు.! అంగనవాడి టీచర్లకు,కనీస వేతనం 26000, ఆయాలకు, 20000 పెంచాలని, పెండింగ్‌ఉన్న 1810 మినీ వర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్స్ చేసి మెయిన్ సెంటర్‌గా మార్చాలని, చట్టబద్ధమైన గ్రాట్యూటీ అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు భర్తీ చేయాలని హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచలేదన్నారు. గత ప్రభుత్వంలో, అంగన్వాడి ఆందోళనకు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కుప్పంలో జరిగిన అంగన్వాడి ధర్నాలో పాల్గొని మద్దతు ఇచ్చారని, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలైనా, వేతనాలు పెంచలేదన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఐ సి డిఎస్‌కి బడ్జెట్‌లో నిధులు కేటాయించగా పోగ, అంగన్వాడీలకు వేతనం పెంచకపోవడం దారుణం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం ప్రవేశపెట్టిన బడ్జెట్లో అంగన్వాడీలకు తీవ్రమైన అన్యాయం చేసింది స్త్రీ శిశు సంక్షేమ శాఖకు కేవలం 4259లో కోట్లు కేటాయించారు ప్రస్తుతం అవసరాలకు ఈ బడ్జెట్ కేటాయింపు సక్రమంగా లేదన్నారు పౌష్టికమైనటువంటి ఆహారానికి కూడా ఈ బడ్జెట్ సరిపోదన్నారు.. అంగన్వాడీ ప్రతినిధులు ఇంద్ర,బాగ్యా,పార్వతి,రాజు,సావిత్రి, వసంత,వెంకట లక్ష్మి,రవనమ్మ,అంగన్వాడీలు పాల్గొన్నారు.

## 1.43 కోట్లు విలువైన లిక్విడ్ గంజాయి సీజ్

### చింతపల్లి లో 11.5 కిలోలు పట్టివేత... ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం. చింతపల్లి సీఐ వినోద్ బాబు

గూడెం కొత్త వీధి / పాడేరు, మార్చి 3 (ప్రభాతవార్త)



అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలో మత్తు పదార్థాల అక్రమ రవాణాపై పోలీసులు దాడులు ముమ్మరం చేశారు. అన్నవరం పోలీస్ సిబ్బంది ముందస్తు సమాచారంతో లోతుగడ్డ వంతెన సమీపంలో చేపట్టిన వాహన తనిఖీల్లో బాగంగా భారీగా లిక్విడ్ గంజాయి పట్టుబడింది. మొత్తం 11 కిలోల 500 గ్రాముల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చింతపల్లి సీఐ ఎం. వినోద్‌బాబు తెలిపారు. దీని అంచనా విలువ సుమారు రూ.1 కోటి 43 లక్షలు ఉంటుందని చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మారుమూల ఆంధ్ర--ఒడిశా సరిహద్దు ప్రాంతమైన బలపం పంచాయతీ పరిధిలోని లమడంపల్లి గ్రామానికి చెందిన బోనంగి జకర్య, బోనంగి ధనబాబు పల్సర్ ద్విచక్ర వాహనంపై లిక్విడ్ గంజాయిని రవాణా చేస్తున్నట్లు అన్నవరం పోలీసులకు సమాచారం అందింది. దీంతో అన్నవరం--లోతుగడ్డ వంతెన వద్ద చింతపల్లి ఎస్సై జి. వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు మాటువేసి తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో నిందితులు పాఠశాల పుస్తకాల బ్యాగ్‌లో సీసాల్లో నింపి లిక్విడ్ గంజాయిని తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని మొత్తం సరుకును స్వాధీనం చేసుకున్నారు. ఒక పల్సర్ ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వినోద్‌బాబు వెల్లడించారు. మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రజలు అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో నిషేధిత మత్తు పదార్థాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## 7న సర్వసభ్య సమావేశం. ఎంపీడీవో విశ్వనాథ్



డుంబ్రిగుడ: మార్చి 03 (ప్రభాతవార్త)

మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో ఈనెల 7న సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నామని ఇన్చార్జి ఎంపీడీఓ విశ్వనాథ్ తెలిపారు. స్థానిక ఎంపీపీ ఈశ్వరి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించనున్నామన్నారు. మూడు నెలలకొమారు నిర్వహించే సమావేశంలో మండలంలో జరిగిన అభివృద్ధి పనులతోపాటు అభివృద్ధికి ప్రణాళికను రూపొందించడం జరుగుతుందని అన్నారు. సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## ఇచ్చిన హామీని నెరవేర్చిన అల్లూరి కలెక్టర్

హుకుంపేట, మార్చి 4,ప్రభాత వార్త



హుకుంపేట మండలం మఠం గ్రామంలో అనాధ పిల్లల ఆశ్రమం వనవాసి కళ్యాణి ఆశ్రమంలో బోర్వెల్ మంజూరు చేస్తామని అల్లూరి కలెక్టర్ దినేష్ కుమార్ ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నారని మఠం సర్పంచ్ శాంత కుమారి పేర్కొన్నారు. అంబేద్కర్ జర్నలిస్టు సేవా సంఘం ఆధ్వర్యంలో ఆశ్రమంలో ఏర్పాటుచేసిన విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు వివిధ పరికరాల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ దినేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమయంలో సర్పంచ్, వనవాసి కళ్యాణి ఆశ్రమం ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే బోర్వెల్ కు తాను నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీని కలెక్టర్ దినేష్ కుమార్ నెరవేర్చుకున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కళ్యాణి ఆశ్రమంలో బోర్వెల్ కొట్టించే పనులను మంగళవారం ప్రారంభించారు. కలెక్టర్ దినేష్ కుమార్ సర్పంచ్ వనవాసి కళ్యాణి ఆశ్రమం తరపున ధన్యవాదాలు తెలిపారు.వార్డ్ మెంబర్ మత్స్యకొండ బాబు , వనవాసి కళ్యాణ ఆశ్రమం మహిళలు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తల నిరసన...!




కొయ్యూరు, మార్చి3, ప్రభాతవార్త

న్యాయమైన డిమాండ్ల సాధనకు విజయవాడలో ధర్నా చేస్తున్న అంగన్వాడీలను పోలీసులు అక్రమ అరెస్టులు చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రం రాజేంద్రపాలెంలో సిఐటియు నేత ఎస్.సూరిబాబు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు హెల్పర్లు నిరసన చేపట్టారు. తమ న్యాయమైన కోర్కెల సాధన కొరకు ఆందోళన చేస్తుంటే పోలీసులు అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే తమకు న్యాయం చేసి, అరెస్టు చేసిన అంగన్వాడీలను విడిచి పెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి పలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నేతలు అగూరు అచ్చియమ్మ, తదితర అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో 10వ తరగతి విద్యార్థి మృతి...

గూడెం కొత్తవీధి మార్చి 3 (ప్రభాతవార్త)



మండలంలోని పూజారిపాకల కొత్తూరు గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందారు. మండలకేంద్రం కొత్తపాకలు గ్రామానికి చెందిన శ్రీను అనే విద్యార్థి గూడెం కొత్తవీధి పూజారిపాకల కొత్తూరు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నారు. అయితే కొంత కాలంగా కడుపునొప్పి రావడంతో ఇంటి నుంచే పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం ఆకస్మాత్తుగా కడుపునొప్పి రావడంతో ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ప్రభుత్వం అక్రమ అరెస్టులు ఆపాలి




### అంగన్వాడిల అరెస్ట్‌ను నిరసిస్తూ బారి ర్యాలీ

హుకుంపేట, మార్చి 4,ప్రభాత వార్త:

అంగన్వాడీ కార్మికనాయకులను ప్రభుత్వం చేసిన అక్రమ అరెస్టులను నిరసిస్తూ మంగళవారం మండల కేంద్రంలో భారీ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ నాయకులు అప్పలకొండ పడాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం కార్యక్రమం స్థానిక సీడీపీఓ కార్యాలయం నుండి కామయ్యపేట జంక్షన్ వరకు అంగన్వాడీ కార్మికులు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. నాలుగు రోడ్ల కూడలిలో గంటపాటు ధర్నా నిర్వహించారు.అరెస్ట్ చేసిన అంగన్వాడీ కార్మిక నాయకులను తక్షణమే విడుదల చేయాలని.! అంగన్వాడీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని. నాయకులపై బనాయించన అక్రమకేశులు ఎత్తివేయాలని, ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని,పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి టి క్రిష్ణరావు నాయకులు కె రామారావు పాల్గొని మద్దతు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి నాయకులను అరెస్ట్ చేయడం హేయమైన చర్య అన్నారు.అర్థరాత్రి నిరసన శిబిరానికి వెళ్లి భయభ్రాంతులకు గురిచేసి మహిళలను వాహనాలు ఎక్కించి అరెస్ట్ పేరుతో ఎక్కడెక్కడో తరలించడం దుర్మార్గం అన్నారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిదర్శనం అన్నారు. ప్రభుత్వం అరెస్టులతో కార్మికులను వేధిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని వారు హెచ్చరించారు. తక్షణమే అరెస్ట్ చేసిన అంగన్వాడీ కార్మికులను విడుదల చేయాలని,వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని,అక్రమ కేసులు కొట్టివేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలు మూసివేసి పెద్ద ఎత్తున టీచర్లు,ఆయాలు పాల్గొన్నారు.

## ఎర్ర రాయి క్వారీ ప్రజాభిప్రాయ సేకరణకు సర్వం సిద్ధం

గూడెం కొత్త వీధి మార్చి 3 (ప్రభాతవార్త)



గూడెం కొత్త వీధి మండలంలోని పెద్దవలస గ్రామపంచాయతీ డోకులూరు గ్రామంలో ఈనెల 4న జరిగే ఎర్ర రాయి క్వారీ ప్రజాభిప్రాయ సేకరణ జరగనున్న నేపథ్యంలో దీనికోసం గూడెం కొత్త వీధి సీఐ సుధాకర్, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో స్థల పరిశీలన జరిగింది. ఈ నెల నాలుగున ఎర్రరాయి క్వారీ త్రవ్వకాల మంజూరు కోసం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులతో పాటు వివిధ గ్రామాల గ్రామస్తులు, ప్రజా సంఘాలు తదితరులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త గా ప్రజాభిప్రాయ సేకరణ జరిగే ప్రాంతాన్ని ఎంపిక చేసి డోకులూరు గ్రామస్తులతో సీఐ సుధాకర్ , ఎస్ఐ సురేష్ చర్చించారు. ఈ సందర్భంగా సిఐ సుధాకర్ మాట్లాడుతూ డోకులూరు ఎర్రరాయి క్వారీ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని గ్రామస్తులు సహకరించి అమలు జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి వచ్చే వారు వారి అభిప్రాయాన్ని నిర్భయంగా తెలియజేయవచ్చని సీఐ అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు సేకరించిన స్థలంలో కార్యక్రమ ఏర్పాటుకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎర్రరాయి క్వారీ గుత్తేదారుడికి సీఐ ఆదేశాలు జారీ చేశారు.

### పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం...!



కొయ్యూరు, మార్చి3, ప్రభాతవార్త

మండలంలోని పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన కనబడింది. మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల నేపథ్యంలో రాజేంద్రపాలెం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరాన్ని కొయ్యూరు సీఐ శ్రీనివాస్, ఎస్సై కిషోర్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన కనబడింది. ఈ వైద్య శిబిరంలో రక్తహీనత కలిగిన బాలికలకు ఐరన్ టాబ్లెట్లు, సాధారణ తనిఖీలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రపాలెం వైద్యాధికారి జగదీష్ నాయక్, పలు

## ఆకర్షించిన చంద్రగ్రహణం

అల్లూరి సీతారామ రాజుజిల్లా కేంద్రం పాడేరు పట్టణం నుండి మంగళవారం సాయంత్రం చంద్ర గ్రహణం దృశ్యాలను కెమెరాలో బంధించిన దృశ్యాలు..చంద్ర గ్రహణం సాయంత్రం 6.26 నిమిషాల నుంచి చంద్ర గ్రహణం ప్రారంభం అయి 6.47 నిమిషాలకు గ్రహణం వీడింది.సుమారు 20 నిమిషాల వరకూ చంద్రగ్రహణం దృశ్యాలను కెమెరాలో బంధించిన దృశ్యం. **ప్రభాతవార్త,పాడేరు.**






## మిడ్-డే మీల్స్ వర్కర్స్ సమస్యలు పరిష్కారించాలి -సిఐటియు



గూడెం కొత్తవీధి మార్చి 3 (ప్రభాతవార్త)

మండలం లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ సిఐయుటి అధ్వర్యంలో దారకొండ, గుమ్మిరేవులు, దుప్పలవాడ పంచాయతీ మిడ్డేమీల్స్ వర్కర్స్ దారకొండలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. గిరిజన సంఘం మండల ఉపాధ్యాయులు బాకురు కోటేశ్వరరావు మాట్లాడుతూ మిడ్డేమీల్స్ వర్కర్స్ చాల సంవత్సరాల నుండి చాలి చాలని, వేతనాలతో పని చేస్తున్నారని, వీరి కష్టాన్ని ప్రభుత్వం గుర్తించి పనికి తగ్గట్టుగా వేతనం పెంపుకు చర్యలు తీసుకోకపోవటం అన్యాయం అని అన్నారు. అలాగే మెనూ అమలు చేయాలని ఒత్తిడి చేయడం జరుగుతుంది కానీ మెనూ చార్జీలు పెంచి నెల నెల చెల్లించాలని ఆలోచన లేదన్నారు. అదే విధంగా ప్రతి స్కూల్లో వంటచెడ్డులు నిర్మించాలనీ అదనంగా హెల్పర్స్ నియమించాలని కోరారు. మిడ్డేమీల్స్ మండల నాయకులు పోతురాజు పాపియమ్మ, అంబిక, మరియు వర్కర్స్ పాల్గొన్నారు.

## ఇంటి పన్ను వసూలుపై యజమానులకు అవగాహన



(నక్కపల్లి, ప్రభాతవార్త)

ఇంటి పన్నులు వసూళ్లు విషయంలో ఎంపీడీవో చైతన్య ఆధ్వర్యంలో మండలంలోని గొడిచర్ల గ్రామంలో కార్యదర్శి కిరణ్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు పంచాయతీ కార్యాలయానికి రాకుండా నేరుగా ఆన్లైన్ ద్వారా ఏ విధంగా పన్ను చెల్లించవచ్చు అనేది తెలియజేశారు. మంగళవారం ఎంపీడీవో చైతన్య ప్రత్యేక పన్నులు వసూలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు.

## అంగరంగ వైభవంగా బోనాల ఊరేగింపు

(ఎస్ రాయవరం మార్చి3 ప్రభాతవార్త )



మండలంలో పెద్ద గుమ్ములూరు గ్రామంలో శ్రీ నూకంబిక మరిడిమాంబ ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా మంగళవారం భారీ సంఖ్యలో భక్తులు బోనాలతో అమ్మవారి విగ్రహాలను మేళ తాళాలు.తప్పిడుగుళ్ళు.శక్తి వేషాలతో తిరువీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆలయ కమిటీ చైర్మన్ ఏజర్ల వినోద రాజు వైస్ ప్రెసిడెంట్ వెలగా శ్రీను కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## గోకులపాడు గ్రామంలో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ

(ఎస్ రాయవరం మార్చి 3 ప్రభాత వార్త )



గోకులపాడు గ్రామంలో మంగళవారం రైతు లకు రాజముద్ర పట్టాదారు పాసు పుస్తకంలో పంపిణీ చేశారు. గతంలో రీ సర్వే పూర్తయిన రైతులందరికీ కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందజేస్తున్నామని గ్రామ రెవెన్యూ అధికారి రాంబాబు తెలియజేశారు ఈ కార్యక్రమంలో జనసేన యూత్ అధ్యక్షులు లింగంపల్లి జ్యోతి కుమార్.స్థానిక నాయకులు సమ్మంగి నానాజీ. శ్రీనివాసరావు. పంచాయతీ కార్యదర్శి ప్రసాదు.రైతులు తదితరులు పాల్గొన్నారు.



## భక్తులకు పులిహోర పంపిణీ

(నక్కపల్లి ,ప్రభాతవార్త )

ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణోత్సవ భాగంగా అధికంగా భక్తులు వస్తారనే ఉద్దేశంతో నక్కపల్లి కి చెందిన ఆర్యవైశ్యులు నున్న కాశి విశ్వనాధ్ ,కొత్త శ్రీను కలిసి పులిహోర ప్రసాదాన్ని వేలాది మంది భక్తులతో అందజేశారు.

## శత శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి:డిప్యూటీ ఎంపీడీవో. సత్యనారాయణ

(ఎస్ రాయవరం మార్చి 3 ప్రభాతవార్త )



మండలంలోని ఎస్ రాయవరం .దార్లపూడి.చిన గుమ్ములూరు. పెద గుమ్ము లూరు.తిమ్మాపురం. వాక పాడు. గుడివాడ గ్రామ పంచాయతీలలో మంగళవారం ఇంటి పన్నులు వసూలు ప్రక్రియలో భాగంగా డిప్యూటీ ఎంపిడిఓ బంగారు సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15 వ తేదీ నాటికి శత శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అందుకోసం ప్రజలు ఇళ్ళ వద్ద అందుబాటులో ఉన్న సమయంలో పంచాయతీ కార్యదర్శిలు ఇంటి పన్నులు వసూలు చేయాలని.. ఇంటి పన్నులు వసూలు చేసే క్రమంలో ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. గృహ యజమానులు తప్పనిసరిగా ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి గ్రామ పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని .. గ్రామ పంచాయతీల ఆర్థిక వనరులు పెంచుకోవడం ద్వారా శానిటేషన్ సిబ్బందికి సమయానికి వేతనాలు చెల్లించడంతోపాటు గ్రామ పంచాయతీలలో కనీస వసతులు అయిన త్రాగు నీరు. వీధి లైట్లు. డ్రైనేజ్ సౌకర్యాలను మెరుగు పరచుకోవచ్చునని ఆయన అన్నారు. మండలంలోని వివిధ పంచాయతీల నుండి సుమారు రెండు లక్షల ఎనబై ఆరు వేల రూపాయలు వసూలు అయినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు కర్రి వెంకట శ్రీనివాసరావు .జోగా నరేష్. ప్రసాద్.. నాగ ప్రభు.. నాగ రాజు. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాల్లో ఎలక్ట్రికల్ ఉద్యోగులు

(నక్కపల్లి, ప్రభాతవార్త )



మండలంలోని ఉపమాక వెంకటేశ్వర స్వామి వార్షిక కళ్యాణోత్సవాల్లో భాగంగా మంగళరం మండలంలోని రాజయ్యపేట తీరం వద్ద జరిగిన స్వామివారి చక్రస్నానానికి వచ్చే భక్తులకు మండలంలోని ఉపమాక, వేంపాడు సబ్ స్టేషన్‌లో పని చేస్తున్న ఎలక్ట్రికల్ ఉద్యోగులు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేలాది మంది భక్తులకు సరిపడే విధంగా ప్రసాదాలను సిద్ధం చేసి అందజేశారు. భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ తో పాటు లైన్మెన్లు ఉన్నారు.

## అంగన్వాడి అక్రమ అరెస్టులు ఆపండి



బొబ్బిలి ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

విజయవాడలో అంగన్వాడి కార్యకర్తలు అరెస్టు చేయడంపై నేడు యాత వీధి యందు మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనీస వేతనాలు అమలు చేయాలని వైసిపి హయాంలో సమ్మె చేస్తే టెన్ట్ ల వద్దకు వచ్చిన టిడిపి నాయకులు అంగన్వాడీల పోరాటానికి మద్దతు ఇచ్చి అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా సమస్యలు పరిష్కారం చేయకపోవడం అన్యాయమని అన్నారు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు మెనూ చార్జీలు పెంచాలని అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు అంగన్వాడీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం చేస్తామన్నారు కార్యక్రమంలో సిఐటియు నాయకులు గోపాలం అంగన్వాడీ యూనియన్ నాయకులు నిర్మల కామేశ్వరి ప్రసన్న నిర్మల అంగన్వాడీలు పాల్గొన్నారు.

## భోగాపురం పీఎం శ్రీ ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థికి ఇన్స్పైర్-మనక్ అవార్డు

భోగాపురం మార్చి 3 ప్రభాతవార్త



పీఎం శ్రీ ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి బోనెల హరి 2025--26 విద్యా సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వ విజ్ఞాన, సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఇన్స్పైర్-మనక్ పథకంలో ఎంపికయ్యాడు. ఈ పథకం కింద విద్యార్థికి రూ.10,000 ప్రోత్సాహక నగదు మంజూరు చేయబడింది. ఈ మొత్తం సైన్స్ ప్రాజెక్ట్ / మోడల్ తయారీకి మరియు జిల్లా స్థాయి ఎగ్జిబిషన్ అండ్ ప్రాజెక్ట్ పోటీల్లో పాల్గొనడానికి వినియోగించబడుతుంది. ఈ విజయానికి మార్గదర్శక ఉపాధ్యాయురాలు సిహెచ్.జయశ్రీ కృషి విశేషమని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. అలాగే ప్రధానోపాధ్యాయురాలు పార్వతి విద్యార్థిని అభినందిస్తూ, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థి సాధించిన ఈ ఘనత పాఠశాలకు, తల్లిదండ్రులకు గర్వకారణమని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా షష్టిపూర్తి దంపతులు.. 16 రోజుల సంబరాలు



గరివిడి మార్చి, 3 ప్రభాత వార్త

గరివిడి లో శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా 58 మంది దంపతులు నిర్వహించిన షష్టిపూర్తి కార్యక్రమంలో భాగంగా సోమవారం అదే దంపతులతో నిర్వహించే 16 రోజులు సంబరాలు వేడుకగా జరుపుకున్నారు. విశ్వభారత్ సేవా ట్రస్ట్, రీ యూనియన్ ఆఫ్ గరివిడి సంయుక్త ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. గణపతి పూజతో శాస్త్రోక్తంగా జరిగిన కార్యక్రమంలో కొత్త దంపతులు మాదిరిగా పెళ్లి వేడుకలు నిర్వహించుకున్నారు. 58 మంది షష్టిపూర్తి జరుపుకునే దంపతులు సోమవారం రాత్రి పెళ్లి వేడుకలు మాదిరిగా నిర్వహించుకొని తమ పెళ్లినాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. వేడుకల్లో తొలుత గరివిడి రీయూనియన్ ప్రతినిధి కంబాల శివ కార్యక్రమానికి స్వాగతోపాన్యాసం గావించగా విశ్వ భారత్ సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బలివాడ రమేష్ కార్యక్రమ వివరాలు వెల్లడించారు. భవిష్యత్తు లో గరివిడి లో ఒక మహోత్సవం లా శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రీ యూనియన్ ప్రధాన కార్యదర్శి ముదునూరు జగన్నాధరాజు, వేద పండితులు రాంభట్ల సుబ్బారావు తదితరులు ప్రసంగించారు. ఎంతో ఉత్సాహ వాతావరణంలో దంపతులు పెళ్లి నాటి తంతు నిర్వహించుకొని మధురానుభూతిని పొందారు. ఇలాంటి వేడుకలు గరివిడి లో నిర్వహించడం పట్ల స్థానికులు నిర్వాహకులుని అభినందించారు. షష్టి పూర్తి వేడుకలు నిర్వహించుకున్న 58 కుటుంబాలకు వారి చిత్రం తో కూడిన జ్ఞాపికను విశ్వ భారత్ ట్రస్ట్ అధినేత బలివాడ రమేష్, రీ యూనియన్ ఆఫ్ గరివిడి ప్రధాన కార్యదర్శి ముదునూరు జగన్నాధరాజు ,రాంబట్ల సుబ్బారావు లు బహూకరించారు.కాగా కార్యక్రమంలో రీ యూనియన్ ప్రతినిధులు సాగి భాస్కర రాజు,కంబాల శివ, మేదరమెట్ల వెంకటేశ్వర రావు, బొంపల్లి వెంకట రావు, టి వి రమణ,ఏ సత్య శ్రీనివాస్, బొడ్డేపల్లి ప్రసన్న కుమార్, తూట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రైబల్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో ఏనుబరువు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

రామభద్రపురం, మార్చి, 3 ప్రభాత వార్త




రామభద్రపురం మండలం రావివలస గ్రామపంచాయతీ ఎనుబరువు గ్రామంలో ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా కమిటీ, తిరుమల మెడికవర్ హాస్పటల్ ఆధ్వర్యంలో మెడికల్ ఉచిత వైద్య శిబిరం ఆదివారంఏర్పాటు చేశారు. ఎంతో అనుభవం ఉన్న వైద్యులతో అన్ని పరీక్షలు చేసి వెంటనే చేయవలసిన వైద్యం అందించి ఏమైనా అత్యవసర చికిత్స అందించాలనుకునే వారిని విజయనగరం తిరుమల మెడికవర్ హాస్పటల్‌కి తీసుకుని వెళ్లి చికిత్స చేయడం జరుగుతుంది తెలియజేశారు. ఈ వైద్య శిబిరములో 10 గ్రామాల గిరిజన ప్రజలకి 250 మందికి మెడి కవర్ హాస్పిటల్ డాక్టర్ టి. జగదీశ్వరరావు, డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఇల్లపదొర నరసింహ దొర, రాష్ట్ర అధ్యక్షులు రొబ్బా లోవరాజు, ట్రైబల్ రైట్స్ ఫోరంజిల్లా ఉపఅధ్యక్షులు ప్రసాద్,జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల ధనంజయ, పార్వతీపురం మన్యం జిల్లా ఉప అధ్యక్షులు తోయక గణేష్, రవి, డా.అభిలేష్, డా.నిఖిత, డా. మైరిన, డా.నిహారిక, డా.అరుణ్ పాల్గొన్నారు.

## ఈనెల 15వ తేదీ నాటికల్లా ఇళ్ల పన్నులు వసూళ్లు కార్యదర్శులు చేపట్టాలి



### పంచాయతీ విస్తరణ అధికారి వెంకటరమణ

రామభద్రపురం, మార్చి, 3 ప్రభాత వార్త

ఈనెల 15వ తేదీ నాటికల్లా పంచాయతీ కార్యదర్శులు ఇళ్ళ పన్నులు వసూళ్లు వేగవంతంగా చేపట్టాలని పంచాయతీ విస్తరణ అధికారి వెంకటరమణ కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాల యం ఆవరణలో ఆయన విలేకరు లతో మాట్లాడుతూ ఇళ్లపన్నులు 67 లక్షల 60 వేల రూపాయలు డిమాండు ఉండగా ఇంతవరకు 39 లక్షల రెండు వేల రూపాయలు వసూళ్లు అయ్యాయన్నారు. ఇంకా 28 లక్షల 44 వేల రూపాయలు వసూళ్లు కావాల్సి ఉందన్నారు. అలాగే మార్కెట్, చెరువుల పెంపకం, కోల్డ్ స్టోరేజ్ సంబంధించిన పన్నుల డిమాండ్ 47 లక్షల 52 వేల 251 రూపాయలు ఉండగా వసూళ్లు 37 లక్షల 45 వేల 670 రూపాయలు అయ్యా అన్నారు. 10 లక్షల 6వేల 581 రూపాయలు వసూళ్లు కావాల్సి ఉంది అన్నారు. జిల్లాలో 25వ స్థానంలో పన్నులు వసూళ్లలో రామభద్రపురం మండలం ఉందని, అలాగే మార్కెట్ చెరువుల పెంపకం కోల్డ్ స్టోరేజ్ పన్నుల వసూళ్లు స్థానంలో మూడు స్థానంలో ఉన్నామన్నారు. కమిషనర్ ఎప్పటికప్పుడు ఈ పన్నుల విషయమై టెలికాన్ఫరెన్స్ ద్వారా ఎంతవరకు ఏ పంచాయతీలో వసూళ్లు అయ్యా యో అడిగి తెలుసుకుంటున్నారని తెలియజేశారు. ముఖ్యముగా రామభద్రపురం, ఆరికతోట, కొట్టక్కి పంచా యతీలలో ఇళ్ల పన్నులబకాయిలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ వసూళ్లలో డిపి ఓ, డి ఎల్ పి ఓ, ఎంపీడీవో కూడా పాల్గొంటున్నారని, పంచాయతీల్లో ప్రజలు కార్యదర్శులకు ఇళ్ల పన్నుల వసూళ్లలో సహకరించాలని కోరారు.

## ఇంటి పన్నుల కలెక్షన్లు సర్వే పురోగతిని పరిశీలించిన డి.డి. ఓ.రమేష్ రామన్

పాచిపెంట మార్చి 3 ప్రభాతవార్త



మండల కేంద్రమైన పాచిపెంట పంచాయితీ కార్యదర్శి దీపక్ గ్రామంలో ఇంటి పన్నులు వసూళ్ళు, సర్వే చేస్తుండగా పార్వతీ పురం మన్యం జిల్లా డిడిఓ రమేష్ రామన్ మంగళ వారం పాచిపెంట గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించి కార్యదర్శి చేస్తున్న సర్వే ఇంటి పన్ను వసూలు తీరును పరిశీలించారు . అలాగేఓటర్ జాబితా వివరాలను నాన్ టాక్స్ వసూళ్ళ పై ఆరా తీశారు. అదేవిధంగా మండల కేంద్రమైన పాచిపెంట మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న పి ఫోర్ సర్వేలు అలాగే ఇంటి పన్ను వసూళ్ల ఓటర్ జాబితాలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ రాజ్ కమీషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డిడివో తెలిపారు. ఈయన వెంట ఎంపీడీవో బివిజె పాత్రో ఈవోపీఆర్డి మల్లేశ్వరరావు పాల్గొన్నారు .

## జీతాలు పెంచండి జీవితాలు ఆదుకోండి.. అంగన్వాడీల నిరసన..



చీపురుపల్లి మార్చి 3 ప్రభాతవార్త

అంగన్వాడీలకు జీతాలను పెంపుదల చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని చీపురుపల్లి మండల ప్రధాన కేంద్రంలో మంగళవారం నాడు అంగన్వాడి వర్కర్స్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిపారు. చీపురుపల్లిలోని గాంధీ బొమ్మ కూడల నుంచి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం వారి వెనుక పత్రాన్ని స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో అందజేశారు. గత ప్రభుత్వ పాలనలో నిరసనలు చేసిన అంగన్వాడీ కార్యకర్తలకు హామీలు ఇచ్చిన అప్పటి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు హామీలను విశ్వరించి ప్రస్తుతం అంగన్వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నిస్మించారని వారు వాపోయారు. అంగన్వాడీలకు జీతాలు పెంపుదల చేయడంతో పాటు వారి డిమాండ్లు పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు నిరసన తెలియజేశారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కొరకు చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టిన నేపథ్యంలో నాయకులను అరెస్టు చేయడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించి అరకుర జీతాలతో జీవితాలను గడుపుతున్న అంగన్వాడిని నాదుకోవాలని కోరారు. స్థానిక అంగన్వాడి కార్యకర్తల యూనియన్ లీడర్లు నాగమణి పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతిరోజు 100 ఇళ్ల నుండి ఇంటి పన్నుల వసూలు సేకరించాలి.. డి డి ఓ హేమ సుందర్..

చీపురుపల్లి మార్చి 3 ప్రభాతవార్త



పంచాయతీల వారీగా కార్యదర్శిలు ప్రతిరోజు 75 నుండి 100 మంది వరకు ఇళ్ల పన్నుల సేకరణ కొరకు లబ్ధిదారులను కలిసి ఇంటి పన్ను బకాయిలు వసూలు చేయాలని డిడిఓకే హేమ సుందర్ అధికారులకు సూచించారు. మంగళవారం చీపురుపల్లి మండలం మెట్టపల్లి గ్రామంలో ఇంటి పన్ను వసూల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి ఇంటి పన్నుల వసూల కార్యక్రమంలో పాల్గొని విధిగా ప్రభుత్వం నిర్దేశించిన వసూలను వసూలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో అప్పలనాయుడు స్థానిక పంచాయతీ కార్యదర్శి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి అంగన్వాడీలను అరెస్టుచేయడం దారుణం

సాలూరు మార్చి 3 ప్రభాతవార్త




రాష్ట్రంలో అంగన్వాడీలు శాంతియుతంగా వారి సమస్యలు పరిష్కారం చేయాలని విజయవాడలో ఆందోళన చేపట్టగా గత అర్ధరాత్రి నిరసన శిబిరంపై పోలీసులతో దాడి చేయించడం కూటమి సర్కార్ వైఫల్యాన్ని తెలియజేస్తుందని అలాగే ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తుందని సిఐటియు తెలిపింది. మంగళవారం పట్టణ గాంధీనగర్ లో అరెస్టులను నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టింది. అనంతరం సీటూ జిల్లా కార్యదర్శి ఎన్.వై. నాయుడు మాట్లాడుతు గత ప్రభుత్వంలో 42 రోజుల అంగన్వాడీల సమ్మె చేపట్టగా అప్పటి టీడీపీ లీడర్స్ మాప్రభుత్వం వస్తే జీతాలు పెంచుమని హామీ ఇవ్వడం వాస్తవం కాదాఅని ప్రశ్నించారు. అలాగే అధికారం వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వానికి అనేక దఫాలుగా విన్నవించిన పట్టించుకోలేదని విమర్శించారు. కాబట్టి సమస్యలు పరిస్కరించి అలాగే అరెస్టుచేసిన వారిని విడుదల చేసి కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేసారు.సీత,నాగమణి,రాముడు,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి సర్కారుది... మనీ కాంట్రాక్టర్లది..

### చీపురుపల్లిలో కాసులు కురిపిస్తున్న కాలువ మట్టి.. చోద్యం చూస్తున్న అధికారులు..



చీపురుపల్లి, మార్చి 3 ప్రభాతవార్త

చీపురుపల్లి పట్టణంలోని జి అగ్రహారం దాటిన తర్వాత రాజాం పోవు ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న తోటపల్లి కాలువ మట్టితో పాటు కనకమాలక్ష్మి ఆలయానికి సమీపంలో గల తోటపల్లి కాలువ మట్టి కొంత మంది వ్యాపారులకు కాసులు కురిపి స్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చోద్యం చేస్తున్నారంటూ పలు ఆరోపి స్తున్నారు. ఇళ్ల నిర్మాణమునకు, లోతట్టు ప్రాంతాల కప్పుటకు, అవసరమైన మట్టిని కొంతమంది మట్టి వ్యాపారులు లక్షల ఐదు రూపాయలు కాంట్రాక్టు కుదుర్చుకొని యదేచుగా రాత్రి వేళల్లో తవ్వుకొని అమ్ముకుంటున్నారు. తోటపల్లి కాలువ భూములు సర్కార్వే అయినప్పటికీ కాలువ మట్టి ప్రైవేట్ వ్యక్తులకు వ్యాపారం చేసుకోవడానికి అడ్డగా మారింది. నూతన గృహాల నిర్మాణం తో పాటు పునాదులలో మట్టి ఫిల్లింగ్ చేయడానికి, లోతట్టుగా ఉన్న ప్రాంతాలను మట్టితో కప్పి పుచ్చడానికి లక్షల ఐదు రూపాయలు కాంట్రాక్టులు కుదుర్చుకొని కొంతమంది యదేచుగా అధికారుల కళ్ళుగప్పి రాత్రి వేళల్లో ప్రోక్లైనర్లు పెట్టి మరి మట్టిని తవ్వుకుంటూ దోచుకుంటున్నారు.. ప్రభుత్వానికి సంబంధించిన కాలు మట్టిని ప్రైవేటు వ్యక్తులు ఏవిధంగా అమ్ముకుంటున్నారు అంటూ పలువు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యాపారానికి సంబంధించి అధికార పార్టీ చోటా నాయకులతో పటు ప్రతిపక్ష పార్టీ నాయకుల సహకారం కూడా సదరు మట్టి కాంట్రాక్టర్లకు ఉందంటూ పలువురు ఆరోపిస్తున్నారు. తోటపల్లి కాలువకు సంబంధించిన అధికారుల పర్యవేక్షణ లోపం ఎక్కువ కావడంతో ఎవరు మనల్ని అడిగేది?.. ఎవరు మనల్ని ఆపేది?... అనే నినాదంతో మట్టి వ్యాపారులు యదేచుగా వారి కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు అటూ పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత తోటపల్లి లేదా రెవెన్యూ అధికారులు జరుగుతున్న అక్రమ తవ్వకాల పైన దృష్టి సారించి వారి పైన చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

## బాలికలు అన్ని ఎల్లప్పుడూ ఆత్మ రక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలి : సిఐ అప్పలనాయుడు



లక్కవరపుకోట మార్చి 3, ప్రభాతవార్త

మహిళలు విద్యార్థినిలు అపరిచి తులు ఒంటరిగా వున్నా సమయాలలో ఆత్మ రక్షణ పట్ల అప్రమత్తంగా ఉం డాలి అని ఎస్ కోట రూరల్ సిఐ ఎల్ అప్పలనాయుడు అన్నారు మంగళ వారం జమ్మదేవి పేట కేంద్రంగా నడపబడుతున్న కొత్త వలన మహాత్మ జ్యోతిబాపూలే బిసి బాలికల పాఠశాలలో మంగళవారం మహిళా సాధికారి కత వారోత్సవాలలో భాగంగా ఆత్మ సంరక్షణ అనే అంశాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఆత్మ రక్షణ విషయాలపై అవగాహన కలిగించారు అలాగే వారికి గల హక్కులు బాధ్యతలపై కూడా అవగాహన కలిగించారు ప్రస్తుతం సోషల్ మీడియా లో కొన్ని సంఘటనలు కొన్ని దృశ్యాల ద్వారా యువత పెడదారి పడుతున్నారని అటువంటి వాటి జోలికి వెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ముఖ్యంగా అమ్మాయిలు మాయ మాటలు నమ్మి మోస పోవద్దని ఎవరిని గుడ్డిగా నమ్మ వద్దు అని మాధక ద్రవ్యాల కి చెడు వ్యాసనాలకి ఎవరు బానిస కావొద్దు అని బాగా చదువు కుని వున్నత భావాలతో జీవిస్తూ సమాజ శ్రేయస్సు కై పాటు పడాలి అని తెలిపారు పొక్ససో చట్టంపై అత్యవసర సమయంలో పోలీసుల సహాయం ఎలా పొందాలో వివరించారు ఈ కార్యక్రమంలో ఎల్ కోట ఎస్ ఐ నవీన్ పడాల్ సిబ్బంది పాల్గొన్నారు.

# విజయనగరం పార్వతీపురం మన్యం వార్త

## అంగన్వాడీ ఉద్యోగుల అక్రమ అరెస్టులకు నిరసన




పాచిపెంట మార్చి 3 ప్రభాతవార్త.

సమస్యలు పరిష్కారం చచేయనందుకు శాంతియుతంగా పోరాటం చేసిన అంగన్వా డీలపై రాష్ట్ర ప్రభుత్వం నిరంకసత్వం మానుకోవాలని అంగన్వాడి వర్కర్స్ యూని యన్ నాయకులు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నిరసన తెలియచేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని వేతనాలు పెంచాలని కనీస వేతనాలు అమలు చేయా లని కోరుతూ విజయవాడలో దీక్షలు చేస్తున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించడం సరికాదని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సిఐటియు నాయకులు నల్లి పైడ్రాజు తేడా ప్రభావతి. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన పాచిపెంట ఆది ఆంధ్ర పాఠశాల ఆవరణలో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను గాలికి వదిలి అంగన్వాడీలను రోడ్డు మీదకు నెట్టిందని ఇప్పటికైనా పని భారం తగ్గించాలని కనీస వేతనం అమలు చేయాలని గతంలో ఇచ్చినటువంటి జీవోలను అమలు చేయాలని శాంతియుతంగా పోరాటం చేస్తున్నటువంటి వారిపై ఈ విధంగా పోలీస్ జులుం సరికాదని అక్రమ అరెస్టులతో నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని చంద్రబాబు ప్రభుత్వం తెలుసుకుంటే మంచిదని హెచ్చరించారు. జనన మరణాల నుంచి ఎన్నో సేవలు అందిస్తున్నటువంటి ఐసిడిఎస్ను ఎంతో ఉన్నత స్థాయికి తీసుకు వెళ్లినటువంటి. అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశత్వం సరికాదని అన్నారు. ఇప్పటికైనా కనీస వేతనాలు అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని రాజకీయ వేధింపులు మానుకోవాలని వెంటనే వేతనాలు పెంచాలని కోరారు. విజయవాడలో అరెస్టులు చేసినటువంటి వారిని వెంటనే విడుదల చేయాలని తప్పుడు కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు వీరికి మద్దతుగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జన్నీ రామయ్య పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : నెల్లిమర్ల ఎస్సై గణేష్




నెల్లిమర్ల, మార్చి 3, ప్రభాతవార్త

మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని నెల్లిమర్ల ఎస్ ఐ బి గణేష్ సూచించారు. మహిళా దినోత్సవ వారోత్సవాలను పురస్క రించుకొని స్థానిక కస్తూరిబా పాఠశాలలో నెల్లిమర్ల పోలీసుల ఆధ్వర్యంలో మంగళ వారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్సై గణేష్ మాట్లాడారు. మహిళలు విద్యపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. ప్రధానంగా మహిళల రక్షణ, భద్రత కోసం ప్రభుత్వ రూపొందించిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఈవ్ టీజర్ల పైన, పోకిరి యువకుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని, వేధింపులకు గురిచేసిన వ్యక్తుల సమాచారాన్ని తమకు తెలపాలని ఆయన సూచించారు. ప్రధానంగా సైబర్ నేరాలు పట్ల అవగాహన కలిగి ఉండాలని అన్నారు. కస్తూర్బా పాఠశాల ప్రత్యేక అధికారిని ఉమా, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు, ఏఎస్ఐ రమణమూర్తి పాల్గొన్నారు.

## సమాజాసేవకుడు డా.నరేష్‌కు చాణిక్య లీడర్షిప్ అవార్డు

సాలూరు ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



సాలూరు పట్టణానికి చెందిన డాక్టర్ నరేష్ కుమార్ కు తను చేసిన సేవ కార్యక్రమాలను గుర్తించి వాసవి క్లబ్ ద్వారా చాణిక్య నేషనల్ లీడర్షిప్ అవార్డు వరించింది. అవార్డు రావడంతో పట్టణ ప్రముఖులు నరేష్ కుమార్ ను అభినిందించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతు ఇంకా ఎన్నో సేవ ప్రోగ్రామ్స్ చేస్తానని అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అలాగే నా మీద బాధ్యతలు పెరిగాయని డాక్టర్ నరేష్ కుమార్ తనకు అభినందనలు తెలియజేసిన వారికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.

## జీతాలు పెంచండి.... అంగన్వాడీల నిరసన..

కొత్తవలస మార్చి 3 ప్రభాతవార్త

అంగన్వాడీలకు జీతాలను పెంపుదల చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని కొత్తవలస మండల ప్రధాన కేంద్రంలో మంగళవారం నాడు అంగన్వాడి వర్కర్స్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిపారు. కొత్తవలస కూడల నుంచి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం వారి వెనుక పత్రాన్ని స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో అందజేశారు. గత ప్రభుత్వ పాలనలో నిరసనలు చేసిన అంగన్వాడీ కార్యకర్తలకు హామీలు ఇచ్చిన అప్పటి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు హామీలను విశ్వరించి ప్రస్తుతం అంగన్వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నిస్మించారని వారు వాపోయారు. అంగన్వాడీలకు జీతాలు పెంపుదల చేయడంతో పాటు వారి డిమాండ్లు పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు నిరసన తెలియజేశారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కొరకు చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టిన నేపథ్యంలో నాయకులను అరెస్టు చేయడం పట్ల వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించి అరకుర జీతాలతో జీవితాలను గడుపుతున్న అంగన్వాడిని నాదుకోవాలని కోరారు. స్థానిక అంగన్వాడి కార్యకర్తల యూనియన్ లీడర్లు కాకర తులసి,నాయకులు గాడి అప్పారావు, కృష్ణ, పలువురు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా కలెక్టర్

పార్వతీపురం, మార్చి 3 ప్రభాతవార్త




జిల్లా ప్రజలకు, అధికారులకు, కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి 'హోలీ' పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రంగుల పండుగ హోలీ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, ఈ పండుగ సోదర భావానికి, స్నేహానికి చిహ్నమని ఆయన పేర్కొన్నారు. అందరితో కలిసి మెలిసి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. వసంత కాలపు రాకను చాటిచెప్పే ఈ హోలీ పండుగ జిల్లా ప్రజలందరి ఇళ్లలో సుఖసంతోషాలు నింపాలని కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి తన సందేశంలో ఆకాంక్షించారు.

శ్రీకాకుళం వార్త



## జాడుపూడి బొరివంక రోడ్డుకు రూ.80లక్షల నిధులు



కవిటి, మార్చి 3 (ప్రభాతవార్త)

జాడుపూడి నుండి బొరివంక గ్రామానికి గల ఆర్ అండ్ బి రోడ్డు మరమ్మతులకు రూ.80 లక్షల నిధులు మంజూరైనట్లు ఎంసి చైర్మన్ మణి చంద్రప్రకాష్‌తో పాటు రైల్వే మెంబర్ శ్రీనివాస్ రౌలో తెలిపారు. ఎంతోకాలంగా ఈ రోడ్డు మార్గం శిథిలావస్థకు చేరి ప్రయాణికులకు, వాహనదారులకు నరకానికి నకళ్లుగా మారాయి. పరిస్థితిని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో పాటు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కృషి మేరకు ఈ రోడ్డు మరమ్మతులకు 80 లక్షల రూపాయలు నిధులు మంజూరు జరిగినట్లు తెలిపారు. ఈ నిధులు మంజూరుకు కృషి చేసిన దేశం ప్రజాప్రతినిధులకు బాసుదేవ్ రౌళో, ఎంపీటీసీ ప్రతినిధి సంతోష్ కుమార్ పట్నాయక్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## అమ్మవారి కాలనీలో పారిశుద్ధ్య పనులు చేపట్టిన మున్సిపల్ సిబ్బంది



రాజాం, మార్చి 3 ప్రభాతవార్త:

రాజాం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అమ్మవారి కాలనీ ఆరవ వీధిలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక మురికి నీరు చేరి నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు వలన అంటువ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో సూపర్ వైజర్ జయరాజ్ తమ సిబ్బందితో బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేసి ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ విధంగా సక్రమమైన డ్రైనేజీ వ్యవస్థ లేని ప్రాంతాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందుస్తు చర్యలు చేపట్టినందుకు గాను మున్సిపల్ సిబ్బందిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## చంద్రగ్రహణం సందర్భంగా శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయం మూసివేత



జలుమూరు, మార్చి 3 ప్రభాతవార్త:

దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయం మంగళవారం ఉదయం 9 గంటలకు చంద్రగ్రహణం సందర్భంగా మూసివేసినట్లు ఆలయ ఈవో టి.ఏడుకొండలు తెలిపారు. మరల అదే రోజు రాత్రి 7:30 గంటలకు దేవాలయం సంప్రోక్షణ చేయబడుతుందని అన్నారు. ఈ విషయాన్ని భక్తులు గమనించవలసినదిగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పురోహితుల సంఘం అధ్యక్షులు ఎస్వీ చలం, పురోహితులు పాల్గొన్నారు.

## కొత్త పింఛన్ల హామీ గాలికేనా..? : మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి




పాతపట్నం, మార్చి 3 ప్రభాతవార్త:

అర్హులకు కొత్త పింఛన్లు ఇస్తామని బూటకపు హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి విస్మరించిందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఇంకా కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడంతో అర్హులకు ఎదురుచూపులు తప్పడం లేదన్నారు. గతేడాది అక్టోబర్ 1వ తేదీనుంచి కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది కానీ ఇంతవరకు ఒక్క పింఛన్ కూడా ఇవ్వలేదన్నారు. కనీసం దరఖాస్తు చేసుకోవడానికి వెబ్సైట్ కూడా తెరవలేదని, దీంతో నియోజకవర్గంలోని పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్ పేట మండలాల్లో అర్హులైన లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని ఆమె అన్నారు. అర్హుల ఆవేదన, అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారని కూటమి ప్రభుత్వం పింఛన్ మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఇబ్బందులు తప్పడం లేదన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు గ్రామ సచివాలయాలకు రోజూ పదుల సంఖ్యలో లబ్ధిదారులు కాళ్లు అరిగేలా తిరుగుతున్నారని, ప్రభుత్వం వెబ్సైట్ తెరవకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో పక్కాగా పింఛన్లు అందించేవారని, రాజకీయ పార్టీలతో సంబంధంలేకుండా వలంటీర్లు దరఖాస్తు పూర్తి చేసి సచివాలయాల్లో ఇస్తే పింఛన్లు మంజూరయ్యేవని ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగిందని, కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా పోయిందన్నారు. మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని కానీ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్లోనూ దీనికోసం నిధులు కేటాయించకుండా ఇచ్చిన హామీని గాలికి వదిలేశారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని రెడ్డి శాంతి మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే కొత్త పింఛన్లు మంజూరు చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## సీతయ్య ఫౌండేషన్‌లో హోలీ పండుగ



కంచిలి, మార్చి 3 ప్రభాతవార్త:

వృద్ధాశ్రమం దరి చేరుతున్న దక్షత లేనటువంటి వయోవృద్ధులకు సంవత్సరం పొడుగున వచ్చే పండగల సంతోషాలను పంచి పెట్టాలనే సదుద్దేశ్యంతో వయోవృద్ధుల యొక్క మానసిక ఒత్తిడిని వారి నుంచి దూరం చేస్తూ మంగళ వారం హోలీ పండగ సందర్భంగా ఆశ్రయం పొందుతున్న వయోవృద్ధులు, మానసిక వికలాంగులు ఉల్లాసంగా, ఆట పాటలతో రంగుల హోలీ పండుగను జరుపుకున్నారు. వయో వృద్ధుల సహాయార్థం వృద్ధాశ్రమం సేవలో తరిస్తూ ఆశ్రమ వ్యవస్థాపకులుగా గుల్ల మోహనరావు, రమేష్‌లు సంతోషం వ్యక్తం చేశారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేసిన ఎమ్మెల్యే ఎంజీఆర్



పాతపట్నం, మార్చి 3 ప్రభాతవార్త:

పాతపట్నం నియోజకవర్గ పరిధిలోని ఎల్ఎన్ పేట మండలంలోని పెద్దకొల్లివలస గ్రామానికి చెందిన బైరి యశోదమ్మ అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు (ఎంజీఆర్) దృష్టికి తీసుకురాగా, ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయనిధి కొరకు సిఫార్సు చేశారు. సిఎం రిలీఫ్ ఫండ్ నుండి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయంగా వచ్చిన 70,322 రూపాయల చెక్‌ను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గోవిందరావు వారికి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యపరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## విద్యతోనే ఉన్నత శిఖరాలు




కోటబొమ్మాళి, మార్చి 3 (ప్రభాతవార్త)

విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని స్థానిక ఎస్సై వి.సత్యన్నారాయణ తెలిపారు. మంగళవారం ఎత్తులపాడు పంచాయతీ పరిధిలోని శ్రీ సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు మరియు పాఠశాల వార్షికోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణతో విద్యాను అభ్యసించాలని ఆయన కోరారు. నిరంతరం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ విద్యార్థులపై ఉండాలని ఆయన అన్నారు. పాఠశాలను ఈ స్థాయికి తీసుకువచ్చిన యాజమాన్యానికి ఆయన అభినందించారు. పోటీ ప్రపంచంలో విద్యార్థుల ఎంచుకన్న విద్యవైపే ప్రోత్సాహం ఉండాలన్నారు. వారికి అవగాహన లేని చదువులపై పెట్టి వారి భవిష్యతును పాడుచేయవద్దునని ఆయన కోరారు. విద్యపైనే కాకుండా క్రీడలు పైన కూడా దృష్టి సారిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తలగాన గణపతిరావు, పాఠశాల ముఖ్య సలహాదారు గురువెల్లి అప్పన్న, కరస్పాడెంట్ చాప భవాని శ్రీనివాస్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నవారిలో ఉన్నారు.

## యువత చదువుతో పాటు క్రీడాల్లో రానించాలి

### జిల్లా తెలుగు యువత కార్యదర్శి దాసురాజు..మరువాడలో క్రీడా మైదానం ఏర్పాటు

సంతబొమ్మాళి, మార్చి 3 ప్రభాతవార్త



గ్రామీణ ప్రాంతం యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని జిల్లా తెలుగు యువత కార్యదర్శి, మరువాడ సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు అన్నారు. మండలంలోని మరువాడ పంచాయతీ గుడిమీదపేట, చొక్కరవానిపేట, సూరాడవానిపేట సమీపంలో దాసురాజు యువకులు ఆడుకోవడానికి తన సొంత నిధులతో క్రికెట్ మైదానాన్ని ఏర్పాటు చేసి మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తీర ప్రాంత యువకుల్లో క్రీడా నైపుణ్యాలు మెరుగ్గా ఉన్నాయని, వాటిని మరింత సానపెట్టేందుకు తాను కృషి చేస్తున్నానని తెలిపారు. గతంలో కూడా పంచాయతీలో రెండు క్రీడా మైదానాలు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని, క్రీడాకారులకు అవసరమైన సహాయం తన వంతుగా ఎప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. మైదానం ఏర్పాటు చేసిన దాసురాజుకు పలువురు క్రీడాకారులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## గిరిజన సంఘాల నాయకులతో సమన్వయ సమావేశం

సీతంపేట, మార్చి 3 ప్రభాతవార్త

గిరిజన సంఘాల నాయకులతో బుధవారం ఉదయం 10 గంటలకు సీతంపేట ఐటీడీఏ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సీతంపేట ఐటిడిఏ పరిధిలోని పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లోని ప్రతీ గిరిజన సంఘం నుంచి ఇద్దరు ప్రతినిధులు హాజరుకావాలని పీవో ప్రకటనలో కోరారు.

## చంద్రగ్రహణంతో మూతబడిన వెంకటేశ్వర ఆలయం



సీతంపేట, మార్చి 3 ప్రభాతవార్త :

చంద్రగ్రహణం కారణంగా సీతంపేటలో ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వెంకటేశ్వర ఆలయం మంగళవారం మూసివేశారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు ఆలయం తలుపులు మూసి వేశారు. ఆలయ శుద్ధి చేసిన తర్వాతనే భక్తులకు ఆలయ దర్శనాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

## ఒరియా విద్యాపరమైన సమస్యలు పరిష్కరించాలి

### నారా లోకేష్‌ను కోరిన ఆపోటశాఖ



కవిటి, మార్చి 3 ప్రభాతవార్త

ఒరియా విద్యాపరమైన అలానే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని రాష్ట్ర ఒరియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రం అందించి సమస్యలు వివరించారు. మంగళవారం విజయవాడలోని మంత్రి నారా లోకేష్‌ను ఇచ్ఛాపురం ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌తో పాటు ఆపోట శాఖ ప్రతినిధులు భాస్కర్ పాడి కార్యదర్శి బృందావన దోలాయి కోరారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వివిధ మేనేజ్మెంట్ పాఠశాలలో 12,000 మంది ఒరియా విద్యార్థులు చదువుతున్నారని అయితే అదే స్థాయిలో ఉపాధ్యాయులు నియామకాలు జరగక విద్యార్థులు విద్యాభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. రాబోయే డీఎస్సీలో ఒరియా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసే విధంగా నిబంధనలు ఏర్పాటు చేయాలని ముక్తకంఠంతో కోరారు. శ్రీకాకుళం జిల్లాలో కవిటి, కంచిలి, సోంపేట, మందస మండలాల పరిధిలో 8 ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో మూడు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు ప్రత్యేకంగా ఒడియా గిరిజన విద్యార్థుల కొరకు ఒడియా మాధ్యమంలో నిర్వహింపబడుతున్నాయని తెలిపారు. అయితే ఇక్కడ ఉపాధ్యాయులు మాత్రమే తెలుగు వారు కావడం వల్ల ఒడియా మాధ్యమం గల పిల్లలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తక్షణమే తెలుగు ఉపాధ్యాయులను తొలగించి ఒడియా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఆంధ్ర రాష్ట్రంలో ముఖ్యంగా శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలో ఉన్న ఒడియా విద్యాభివృద్ధికి తీవ్ర విఘాతం ఏర్పడుతుందని ప్రభుత్వం చొరవ చూపి విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి తక్షణ చర్యలు చేపట్టి ఒరియా విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

## ఆవుకి రెండు తలల వింత దూడ జననం



ఇచ్ఛాపురం, మార్చి 3 ప్రభాతవార్త:

మండలం ఎం.తోటూరు గ్రామంలో ఆవు వింత దూడను జన్మనిచ్చింది. దూడకు రెండు తలలు ఉన్నాయి. ఈ వింత దూడను చూసేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి వచ్చిన ప్రజలు దేవునిలా భావించి పూజలు జరిపించారు. ఎం.తోటూరు గ్రామానికి చెందిన పాడి రైతు కాళ్ల తులసీదాస్‌కు చెందిన ఆవుకు సోమవారం అర్ధరాత్రి నుండి పెద్ద పెద్ద అరుపులు వేస్తుంది. అరుపులు విన్న రైతు వెంటనే బయటకు వచ్చి ఆవును చూసే సరికి ఆవు ఉక్కిరి బిక్కిరి అయ్యి అరుస్తుంది. దీన్ని గమనించిన రైతు వెంటనే పశువైద్యునికి పిలిపించారు. ఆవును పరిశీలించిన డాక్టర్ వెంటనే బలవంతంగా ఆవు కడుపు నుంచి దూడను బయటకు తీసారు. బయటకు వచ్చిన దూడను చూసే సరికి దూడకు రెండు తలలు ఉన్నాయి. వెంటనే వైద్యం అందించారు. అయితే రెండు తలలతో జన్మించిన దూడ బ్రతకటం కొంచం కష్టమని తెలిపారు.

## ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి సహకరించాలి : ఎంపీడీవో ఎల్.త్రినాథ్



కవిటి, మార్చి 3 ప్రభాతవార్త

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి ప్రభుత్వ సిబ్బందికి పంచాయతీ సిబ్బందికి సహకరించాలంటూ ఎంపీడీవో ఎల్.త్రినాథ్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు కవిటి కపాసుకుద్ది, నెలవంక పంచాయతీలో గల ఇంటింటికి వెళ్లి ఇంటి పన్నుల వసూలుపై చేపడుతున్న చర్యలను పరిశీలించారు. యజమానులతో మాట్లాడుతూ ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలని తద్వారా జరిగే ఉపయోగాలను గూర్చి వివరించారు. ఈయనతో పాటు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## కనీస వేతనాలు చెల్లించరా...!

### నిరసన తెలిపిన ఆశా కార్యకర్తలు



వీరఘట్టం, మార్చి 3 ప్రభాతవార్త

ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు చెల్లించరా.. అంటూ మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆశాకార్యకర్తలు తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎన్.ప్రసాదరావు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు అన్ని రకాల సెలవులు ఇవ్వాలని, మట్టి ఖర్చులు కూడా అందజేయాలని, ప్రభుత్వమే నియమకాలు చేపట్టాలని, శిక్షణ ఏఎన్ఎం, జిఎన్ఎంలకు పర్మినెంట్ పోస్టులు భర్తీ సందర్భంగా ప్రాధాన్యత కల్పించాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశా సంఖ్యను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం చెల్లించే పదివేలు నెలలో పీహెచ్‌సికు మరియు ఆసుపత్రులకు వెళ్లడానికి మూడు నుంచి నాలుగు వేలు వరకు ఖర్చు అవుతుందని, ఆశా కార్యకర్తలకు సంబంధం లేని పనులను వైద్య అధికారులు చేయిస్తున్నారని, అధిక జనాభాలో పని చేయడం వలన ఆశ కార్యకర్తలు పని ఒత్తిడి కారణంగా అనారోగ్యానికి గురి అవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌ని ఆశాలుగా చేర్పించాలని సమాన వేతన, ఇతర సౌకర్యాలు కల్పించాలని, పి.హెచ్.సికి వెళ్ళిన ప్రతి సందర్భంలో ట్రావెలింగ్ అలవేన్సులు ఇవ్వాలని, రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. ఈ నెల 5వ తేదీన చలో విజయవాడలో జరిగే రాష్ట్ర ధర్నా కార్యక్రమానికి ఆశా కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీల అరెస్టులు అన్యాయం

### కొత్తూరులో సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ నిరసన

కొత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త :

తమ న్యాయమైన కోర్కెలు తీర్చాలని కోరుతూ విజయవాడలో శాంతియుతంగా మహాధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండించింది. మంగళవారం కొత్తూరు మండల కేంద్రంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ కన్వీనర్ పనస రమేష్ మాట్లాడుతూ అంగన్వాడీల గొంతు నొక్కాలని చూడటం తగదని, నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరని హెచ్చరించారు. గత ఏడేళ్లుగా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరుతున్నా పాలకులకు పట్టడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాకముందు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, నేటికీ ఆ మాట నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ నాయకులు కె.వి. హేమలత, లక్ష్మి, అమ్మాయమ్మ మరియు ధనలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీలకు ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను వివరించారు. దేశమంతా ఒకే రకమైన యాప్ అమలులో ఉంటే, మన రాష్ట్రంలో మాత్రం అనేక యాప్‌లు పెట్టి అంగన్వాడీలపై పనిభారం పెంచుతున్నారని విమర్శించారు. వెంటనే నాణ్యమైన ట్యాబ్‌లు ఇచ్చి, కేవలం ఒక్క యాప్ ద్వారానే పనులు నిర్వహించేలా చూడాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు, గర్భిణీలకు, బాలింతలకు అమలు చేస్తున్న ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని రద్దు చేయాలని, పెరిగిన ధరల దృష్ట్యా మెనూ చార్జీలు పెంచాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మినీ అంగన్వాడీలను మెయిన్ వర్కర్లుగా మారుస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని, గ్రాట్యుటీ అమలులో మార్పులు చేయాలని మరియు హెల్పర్ల పదోన్నతులకు స్పష్టమైన విధివిధానాలు రూపొందించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని, అందరూ ఐక్యంగా ఉండి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పద్మావతి, బోడమ్మ, నిర్మల, రాజేశ్వరి, అనురాధ, నీరజ, ఉత్తర, కళావతి తదితరులు పాల్గొన్నారు.




## కోటబొమ్మాళి ఆర్ఎస్‌లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన




సంతబొమ్మాళి, మార్చి 3 ప్రభాతవార్త

టెక్కలి సబ్ డివిజన్ శక్తి టీం ఆధ్వర్యంలో మండలంలోని కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ ఆవరణలో మోటారు వాహన చట్టం గూర్చి, ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైల్వే హెల్ప్ లైన్ నెంబర్ 1039 గూర్చి అవగాహన కల్పిస్తూ టెక్కలి హెడ్ కానిస్టేబుల్ ఎం.గిరిధర్, కోటబొమ్మాళి హెడ్ కానిస్టేబుల్ కె.గణేష్, సారవకోట మహిళా పోలీస్ కె.రమణమ్మ స్థానికులకు అవగాహన కల్పించారు. అలాగే ద్విచక్ర వాహనం వాడేవారు విధిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వలన జరిగే ప్రమాదాల కోసం వివరించారు. అలాగే మద్యం తాగి వాహనాలు నడుపుట వలన జరిగే ప్రమాదాలు, రైల్వే ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు కోసం నేషనల్ హైవేపై ఏదైనా ప్రమాదం జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1033 కోసం తెలియజేస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

## హరి బెహరాకు అండగా లావణ్యరెడ్డి



కవిటి, మార్చి 3 ప్రభాతవార్త:

మండలం కవిటి గ్రామానికి చెందిన నిరుపేద హరి బెహరకు ఇచ్ఛాపురం చెందిన లావణ్య రెడ్డి ఆర్థిక సహకారంతోపాటు నెలకి సరిపడే నిత్యావసర సరుకులను అందించి అండగా నిలిచిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. హరి బెహరా కళాకారుడు అయినప్పటికీ ఈయన నిరుపేద పరిస్థితిని తెలుసుకున్న తోటి కళాకారుని లావణ్య రెడ్డి మంగళవారం కవిటి గ్రామంలో గల అధికార ఇంటికి వెళ్లి ఆర్థిక సహకారంతో పాటు నిత్యావసర సరుకులు అందించింది. ఈ కార్యక్రమంలో శ్రీ వాణి గానా కళా సమితి ప్రతినిధి ఆరింగి వెంకట్రావుతో పాటు పలువురు ప్రతినిధులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



కోటబొమ్మాళి, మార్చి 3 (ప్రభాతవార్త):

ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని శ్రీకాకుళంకు చెందిన మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కోటి, డాక్టర్ శిరీషలు కోరారు. 8వ జాన ఔషది దివాస్ సందర్భంగా కొత్తపేటలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ సుమారు 50 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మెడికవర్ ఆసుపత్రికి రావాలని వైద్యులు సూచించారు. ఆసుపత్రిలో కూడా ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటవరకు ఈ శిబిరం కొనసాగింది. పరిసర గ్రామ ప్రజలైన కొత్తపేట, కోటబొమ్మాళి, కిష్టపురం, జర్జంగి, పాకివలస తదితర గ్రామాలకు చెందిన వారు ఈ శిబిరానికి హజరయ్యారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ సిబ్బంది ఎం.ఝాన్సీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వంశధార నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం మొండిచేయి

### వైఎస్ఆర్సీపీ నాయకుల ధ్వజం



కొత్తూరు, మార్చి 3 ప్రభాతవార్త :

వంశధార రెండో దశ నిర్వాసితుల పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును వైఎస్ఆర్సీపీ నాయకులు తీవ్రంగా తప్పుబట్టారు. కొత్తూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొత్తూరు మండల పార్టీ ఉపాధ్యక్షులు యర్లంకి ధర్మారావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, గూనభద్ర సర్పంచ్ పెదకోట సాధుబాబు మాట్లాడారు. ఎన్నికల సమయంలో నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు పూర్తిగా విఫలమయ్యారని వారు విమర్శించారు. గతంలో వైఎస్ఆర్సీపీ హయాంలో ఎమ్మెల్యేగా ఉన్న రెడ్డి శాంతి నిర్వాసితుల కష్టాలను స్వయంగా తెలుసుకుని, అసెంబ్లీలో వారి తరపున గళం విప్పారని గుర్తు చేశారు. పదవుల కంటే నిర్వాసితుల ప్రయోజనాలే ముఖ్యమని భావించి, ఆమె చేసిన పోరాటం ఫలితంగానే గత ప్రభుత్వం 217 కోట్ల రూపాయలను విడుదల చేసిందని పేర్కొన్నారు. అందులో సుమారు 70 శాతం నిధులు ఇప్పటికే నిర్వాసితుల ఖాతాల్లో జమ అయ్యాయని, కేవలం సాంకేతిక కారణాలతో ఆగిపోయిన మిగిలిన ముప్పై శాతం నిధులను ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలో ప్రతిపక్ష నేతగా కొత్తూరు వచ్చినప్పుడు నిర్వాసితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చి రెండు ఏళ్లు గడుస్తున్నా ఆ హామీలు నీటి మూటలు గానే మిగిలిపోయాయని ఎద్దేవా చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన 2026 బడ్జెట్‌లో కూడా వంశధార నిర్వాసితుల కోసం ఒక్క పైసా కూడా కేటాయించకపోవడం నిర్వాసితులను నిండా ముంచడమేనని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కేవలం మాటలతో కాలక్షేపం చేస్తున్నారే తప్ప, నిర్వాసితులకు రావాల్సిన నిధుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీనే అమలు కాకపోవడం దురదృష్టకరమని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు రావాల్సిన నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ కృష్ణమూర్తి, ఎంపీపీ ప్రతినిధి సవర రమేష్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మురపాక శంకరరావు, నాయకులు మఠం పూర్ణ, నిర్వాసితులు యర్లంకి రమణ, యర్లంకి మణి, యర్లంకి దుర్యోధన తదితరులు పాల్గొన్నారు.

## కదం తొక్కిన అంగన్వాడీలు




రాజాం, మార్చి 3 ప్రభాతవార్త

ఒకవైపు మహిళా ఉద్ధరణ అనే ప్రచారం చేస్తూనే మహిళలు తమ హక్కుల కోసం పోరాడుతుంటే సమస్యలు పరిష్కారం చేయకుండా అంగన్వాడీలను అరెస్టు చేసి నిర్బంధించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కె.సురేష్ తెలిపారు. అలాగే అంగన్వాడీలకు కనీసవేతనం 26వేలు ఇచ్చేవరకు పోరాటం చేస్తామని తెలిపారు. అదేవిధంగా విజయవాడలో శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తుంటే ఒక వైపు చర్చలకు పిలుస్తామని చెప్పి మరొక వైపు తెల్లవారుజామున అరెస్టు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. రాజాం పట్టణంలో వేతనాలు పెంచాలని కోరుతూ అంగన్వాడీలు చేస్తున్న శాంతియుత ఆందోళనపై కూటమి ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి మంగళవారం తెల్లవారుజాము నిద్రలో ఉన్న అంగన్వాడీలను, నాయకులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో రాజాం కాంప్లెక్స్ నుండి బొబ్బిలి రోడ్డు జంక్షన్ వరకు మరల ఎల్ఐసి ఆఫీస్ వరకు అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి నిరసన తెలియజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సురేష్, ప్రాజెక్ట్ కార్యదర్శి ప్ రూపావతి సెక్టర్ లీడర్స్ సుశీల, సుజాత, పార్వతి, భారతి, సునీత, దమయంతి, చిన్న తల్లి, నిర్మల, లక్ష్మి, ప్రమీల, వనజాక్షి, రాంబాయి, రాధా, నిర్మల దేవి, ధవలేశ్వరి, ఈశ్వరమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత



సంతబొమ్మాళి, మార్చి 3 ప్రభాతవార్త

సంతబొమ్మాళి మండలం లక్కీవలస పంచాయితీ గద్దలపాడు గ్రామానికి చెందిన బొంగు గురువులు చావు బ్రతుకుల మధ్య రాగోలు జేమ్స్ ఆసుపత్రిలో గత కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. లక్కీవలస సచివాలయం కార్యదర్శి పోలీస్ కానిస్టేబుల్ ఆదిత్య రాజేశ్వరి ఆసుపత్రికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందజేశారు. వీరు అందజేయడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు గెద్దలపాడు గ్రామానికి చెందిన పెద్దలు వీరిని అభినందించారు.

**CHANGE OF NAME**

I, KINTALI RAMYA (existing name of wife as per NOK), am wife of No: 17014594K, Rank- Nk (ATOTECBV), Name Kintali Satish R/o Village Santhabommali, PO- Santhabommali, Teh- Santhabommali, Distt- Srikakulam, State- Andhra Pradesh, PIN-532195, have changed my name from KINTALI RAMYA to NAKKALLA RAMYA vide Affidavit ser. No:IN-AP68202992263271Y, dated 25/02/2026, Kotabommali (SRIKAKULAM).

